



కొండకు ప్రభను తీసుకొస్తున్న మహిళలు, చిన్నారులు







- ఘనంగా శ్రీ త్రికోటేశ్వర స్వామి తిరునాళ్ళ ఉత్సవాలు ప్రారంభం
- స్వామికి విశేష అభిషేకాలు
- కొండకు తరలివచ్చిన చిట్టి పొట్టి ప్రభలు
- గిరి ప్రదక్షిణ చేసిన భక్తులు

కొండంత సంబరం

కోటప్పకొండ(నరసరావుపేట), మార్చి 6: కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో ఏకాదశి పండుగను పురస్కరించుకొని భక్తుల రద్దీ నెలకొంది. తెల్లవారు జాము నుంచే వేలాదిగా భక్తులు కోటప్పకొండకు తరలి వచ్చి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహాశివరాత్రి రోజున త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో జరిగే తిరునాళ్ళ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొక్కుబడి ప్రభలతో భక్తులు కొండకు తరలి వచ్చారు. నరసరావుపేట నుంచి చిన్నారులు, మహిళలు కాలినడకన కోటయ్య సన్నిధికి చేరుకున్నారు. భక్తులు గిరి ప్రదక్షణ చేశారు. కొండ దిగువన సోపాన మార్గం వద్ద ఉన్న విఘ్నేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి వేలాది మంది భక్తులు మెట్ల పూజ చేశారు. సోపాన మార్గంలో ఉన్న ఆనందవల్లి ఆలయంలో కూడా పూజలు చేశారు. ధ్యాన శివుడు, నాగేంద్రస్వామి పుట్ట వద్ద పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో దీపారాధనలు చేశారు. పొంగళ్ళు చేసి స్వామికి సమర్పించారు.






శ్రీ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో భక్తులు

ఉచిత దర్శనం క్యూలైన్‌లో భక్తుల రద్దీ నెలకొంది. నరసరావుపేట పురపాలక సంఘం ప్రభ కోటప్ప కొండకు చేరుకుంది. స్వామి దర్శనం అనంతరం భక్తులు పర్యాటక కేంద్రాన్ని సందర్శించారు. కొండ దిగువన తల నీలాలు సమర్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, ఆలయ ట్రస్టీ రామకృష్ణ కొండలరావు దేవస్థానం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. నరసరావుపేటకు చెందిన శ్రీ షిరిడీ సాయి అన్నపూర్ణ అన్నదాన కమిటీ, ఆర్యవైశ్య సంఘం సేవా సంస్థల ఆధ్వర్యంలో అల్పాహారం, పులిహోర, మజ్జిగ, మంచి నీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి.. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణ సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

- పోటాపోటీగా విద్యుత్ ప్రభల నిర్మాణం
- ఒక్కో ప్రభ ఎత్తు 90 అడుగులకు పైగా..
- తిరునాళ్ళకు 20 భారీ విద్యుత్ ప్రభల నిర్మాణం

రేపే ప్రభల పండుగ

తిరునాళ్ళకు నెల రోజుల ముందు నుంచే గ్రామాల్లో భారీ విద్యుత్ ప్రభల సందడి మొదలవుతుంది. ఊరంతా కలసికట్టుగా ప్రభ పనుల్లో పాల్గొంటారు. తిరునాళ్ళకు 20 భారీ విద్యుత్ ప్రభలు తరలి వస్తున్నాయి. ఒక్కో ప్రభ నిర్మాణ వ్యయం రూ.25లక్షల నుంచి రూ.35 లక్షల వరకు ఉంటుంది. ప్రభల నిర్మాణంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు. గతంలో ఎడ్లతో ప్రభను తరలించేవారు. నేడు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. రాతితో తయారు చేసిన చక్రాల రథాలపై ప్రభలను ఏర్పాటు చేసి కొండకు తరలిస్తారు. ప్రభ పగ్గాలు పట్టేందుకు వందలాది మంది పాల్గొంటారు. రథం ఇరుసు విరిగితే వెను వెంటనే తయారు చేసేందుకు సంబంధిత పనివారు వెంట నడుస్తారు. ప్రభకు ఏర్పాటు చేసే లైట్లు, తోరణాలు అమెరికలో కూడా ప్రత్యేకత సంతరించుకుంటుంది. రంగు రంగుల లైట్లు, వీటిని వెలిగించే విధానం చూపరులను కట్టి పడేస్తుంది. ప్రభల నిర్మాణంలో గ్రామాలకు గ్రామాలు పోటీ పడతాయి. ఈ ప్రభలలో పోస కూర్పు ప్రభలు, మండపాల ప్రభలు, టిక్కీల ప్రభలు, విద్యుత్ ప్రభలు, బాల ప్రభలు ఇలా వివిధ రకాలుగా ఉంటాయి. సాధారణ ప్రభలు అధిక సంఖ్యలో కొండకు తరలి వస్తాయి. ప్రభలపై తిరునాళ్ళలో సంగీత విభావరి, నృత్యాలు నిర్వహిస్తారు. మహాశివరాత్రికి భక్తులు కొండలో జాగరణ చేస్తారు. తిరునాళ్ళ వైభవాన్ని భక్తులు కనులారా వీక్షించి పులకించి పోతారు. నరసరావుపేట మండలంలోని గురవాయపాలెం, ఉప్పలపాడు, కాకాని నుంచి రెండు, ఉప్పలపాడు, గురవాయపాలెం నుంచి కాకాని ఒక్కో భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలి వస్తున్నాయి. చిలకలూరిపేట నియోజకవర్గం పురుషోత్తపట్నం గ్రామం నుంచి 6 ప్రభలు, యడవల్లి, కోమటినేనివారిపాలెం, అవిశాయపాలెం, కమ్మవారిపాలెం, అప్పాపురం, గోవిందాపురం, మద్దిరాల, కావూరు గ్రామాల నుంచి ఒక్కొక్కటి, బొప్పూడి గ్రామం నుంచి రెండు భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలిరానున్నాయి.



గురవాయపాలెం గ్రామంలో తిరునాళ్ళకు నిర్మించిన విద్యుత్ ప్రభ

8 నుంచి 4 గంటల వరకు విద్యుత్ నిలిపివేత

తిరునాళ్లకు వచ్చే ప్రభల కోసం చిలకలూరిపేట రోడ్డులో యూటీ వద్ద ఉన్న హెటీ లైన్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతందని విద్యుత్ శాఖ ఈఈ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. తిరునాళ్ల రోజున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని చెప్పారు. అలాగే తిరునాళ్ల మరుసటి రోజు శనివారం ప్రభలు తిరిగి గ్రామాలకు తరలించేందుకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. గతంలో రెండుగంటల పాటు మాత్రమే విద్యుత్ సరఫరా నిలిపివేయడం ఒకే సారి ప్రభలు రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్న నేపథ్యంలో సమయంను పెంచడం జరిగిందన్నారు.



కొండ దిగువున ఏర్పాటు చేసిన ఎమ్యూజ్‌మెంట్ పార్క్

ఘాట్ రోడ్డులో నడకకు అనుమతి లేదు

భక్తులు సోపాన మార్గంతో పాటు ఘాట్ రోడ్డులో కూడా నడకతో కొండపైకి చేరుకుంటున్నారు. దీని వలన వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యం ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈసారి తిరునాళ్ల రోజున ఘాట్ రోడ్డులో భక్తుల నడకను అనుమతి లేదని ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ప్రకటించారు. భక్తులు సోపాన మార్గం గుండా కొండపైకి రావాలని కోరారు.

తిరునాళ్లకు 528 బస్సులు

తిరునాళ్లకు ఆర్టీసీ 528 బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు నరసరా వుపేట డీఎం బత్తుల వీరాస్వామి బుధవారం తెలిపారు. నరసరావుపేట నుంచి 265, చిలకలూరిపేట నుంచి 100, అద్దంకి 30, ఒంగోలు 45, చీరాల 45, వినుకొండ 43 బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఘాట్ రోడ్డులో కొండ దిగువ నుంచి ఎగువకు భక్తుల కోసం తిరుమల నుంచి వచ్చిన శేషాద్రి బస్సులు నిర్వహిస్తామన్నారు. వీఐపీల కోసం 20 సూపర లగ్జరీ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. నరసరావుపేట నుంచి కొండ దిగువకు టిక్కెట్ రూ.30, కొండ దిగువ నుంచి కొండపైకి టిక్కెట్ రూ.25, చిలకలూ రిపేట నుంచి రూ.30, వినుకొండ రూ.60, ఒంగోలు రూ.120,చీరాల రూ.100, అద్దంకి టిక్కెట్ ధర రూ.105 అని తెలిపారు.



విద్యుత్ వెలుగుల్లో అమరావతి అమరేశ్వరస్వామి ఆలయ గోపురం

క్వారీ తిరునాళ్లకు.. విస్తృత ఏర్పాట్లు

- ఆలయం వద్ద నిర్మించిన చలువ పందిళ్లు
- నిర్మాణంలో ఉన్న విద్యుత్ ప్రభలు

చేబ్రోలు, మార్చి6: గుంటూరు జిల్లాలోనే మహిమాన్విత శైవక్షేత్రంగా వెలుగొందుతున్న క్వారీ బాలకోటేశ్వర స్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జరిగే ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. గుంటూరు నారాకోడూరు ప్రధాన రహదారిని అనుకోని ఉన్న ఈ ఆలయానికి జిల్లా నలుమూలల నుంచి అశేష జనవాహిని శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనేందుకు తరలిరానున్నారు. ఇప్పటికే భక్తుల కోసం అన్ని ప్రభుత్వ శాఖలు ఏర్పాట్లలో నిమ్మగ్నమయ్యాయి. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేశారు. అలాగే స్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్లను సిద్ధం చేశారు. ఆలయం వద్ద విశాలమైన ప్రాంగణంలో ఉండటంతో ఓ వైపు వినోదం, ఆహ్లాదం అందించే జెయింట్ వీల్ వంటి వివిధ క్రీడా సముదాయాలను నిర్మించారు.ఈ ఏడాది నారాకోడూరు, చేబ్రోలు, వేజండ్ల, సుద్దపల్లి తదితర గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు తిరునాళ్లకు రానున్నాయి.



క్వారీ దేవాలయం ముందు విద్యుత్ అలంకరణలు

గోవాడ ముస్తాబు

అమృతలూరు: మహాశివరాత్రి ఉత్సవాలకు గోవాడ శ్రీ బాలకోటేశ్వరస్వామి ఆలయం ముస్తాబైంది. రంగులు వేయడంతో పాటు, చలువ పందిళ్లు, విద్యుత్ అలంకరణతో ఆలయం నూతన శోభ సంతరించుకుంది. స్వామి వారిని భక్తులు సులవుగా దర్శించుకునేలా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం లడ్డూ ప్రసాదం తయారు చేస్తున్నారు. తొలి రోజున జరిగే పశువుల ప్రదక్షిణకు కూడా ఏర్పాట్లు చేశారు. విద్యుత్ ఇబ్బందులు రాకుండా పెద్ద జనరేటర్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో తాత్కాలికంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను సిద్ధం చేశారు. పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చేతి పంపులు ఏర్పాటు చేస్తున్నారు. ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. లక్షల సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ఆ స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు ఈవో అశోక్‌రెడ్డి తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం రోజున స్వామి వారి దర్శనానికి ప్రత్యేక దర్శనం రూ.10, శీఘ్రదర్శనం రూ.20, లఘుదర్శనం రూ.50, వీఐపీ దర్శనం రూ.100లతో పాటు 24 గంటలు ఉచిత దర్శనం కొనసాగుతుందన్నారు. ప్రత్యేక అభిషేకాలు జరగనున్నట్లు చెప్పారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ విద్యుత్ ప్రభను గురువారం సాయంత్రం ప్రారంభించనున్నట్లు తెలిపారు. గృహోపకరణాలు, బొమ్మలు, చెరుకు విక్రయదారులు స్టాల్స్ ఏర్పాటు చేసుకున్నారు.



ముస్తాబైన గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం

ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ ఆలపాటి రమాదేవి, సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.



సిద్ధమైన క్యూలైన్లు

మట్టి ..హాంఫట్

- మట్టి మాఫియాకు అండే.. అధికార పార్టీ అజెండా
- చౌడవరం వద్ద రాత్రిపూట జోరుగా సాగుతున్న మట్టి తవ్వకాలు

ప్రత్తిపాడు, మార్చి 6: వైసీపీ అధికారంలోనికి వచ్చిన నాటి నుండి ప్రత్తిపాడు నియోజకవర్గంలో మట్టి మాఫిగా రెచ్చిపోతోంది. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ఎక్కడ పడితే అక్కడ మట్టి తవ్వకాలు జరుపుతూ కోట్లాది రూపాయలు జేబుల్లో కుక్కుకుంటున్నారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు మట్టి తవ్వకాలు కొనసాగిస్తున్నారు. గుంటూరు రూరల్ మండలంలోని చౌడవరం వద్ద కళ్లం స్పిన్నింగ్ మిల్లు వెనుక, కళ్లం హరినాథరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల పక్కన కనుచూపు మేరలో అక్రమ మట్టి తవ్వకాలు కొన్ని రోజులుగా రాత్రిపూట విచ్చల విడిగా సాగుతున్నాయి. అక్రమ మైనింగ్ జరుగుతున్న ప్రదేశాన్ని ఆనుకుని ఓ పక్క కళాశాల ఉండగా, మరో పక్క కంపెనీలు ఉన్నాయి. ఈ రెండింటి మధ్య హద్దులో సుమారు నలభై అడుగుల లోతులో మట్టిని తవ్వేస్తున్నారు. నిరంతరం మట్టి తవ్వకాలు చేసేందుకు క్వారీల వద్దనే ఒక పొక్లయినర్‌ను ఉంచుతున్నారు. రాత్రి పూట ఇక్కడి నుంచి వందల కొద్దీ లారీలు జాతీయ రహదారిలో పరుగులు పెడుతున్నాయి.



చౌడవరం వద్ద అక్రమ మైనింగ్ జరుగుతున్న ప్రాంతం

అధికార పార్టీ నేత అండదండలతో..

ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అక్రమ మట్టి మాఫియాకు అధికార పార్టీ అండదండలు పుష్కలంగా ఉన్నాయన్నది జగమెరిగిన సత్యమే. నిన్నమొన్నటి వరకు ఇక్కడ ప్రాతినిధ్యం వహించిన ఓ నేత కుటుంబం ఇక్కడ మట్టి మాఫియాను పెంచి పోషించింది. వారి కనుసన్నల్లోనే అక్రమ మట్టి దందా విచ్చలవిడిగా సాగింది. ఆ కుటుంబం నియోజకవర్గానికి దూరం కావడం, ఇప్పుడు నియోజకవర్గంలో మరో నేత ప్రాతినిధ్యం వహించడం జరుగుతుంది. ఈ నేత కనుసన్నల్లోనే అధికార యంత్రాంగం మొత్తం పనిచేస్తోంది. ఇటీవల మట్టి మాఫియాలో కీలక పాత్ర పోషించే ఓ వ్యక్తి ఇటీవల అధికార పార్టీ జెండాను కూడా కప్పుకున్నాడు. కొన్ని రోజులు ఆగిన మట్టి తవ్వకాలు మరలా గుంటూరు రూరల్‌లో ప్రారంభం కావడం.. మట్టి మాఫియా వైసీపీ గూటికి చేరటం వంటి పరిణామాలు అధికార పార్టీ అండదండలకు అద్దం పడుతుంది.



కంపెనీలను ఆనుకుని ప్రమాదకరంగా జరిగిన మట్టి తవ్వకాలు

అందరికీ దండిగా.. అధికారులు అండగా

అక్రమ మట్టి తవ్వకాల విషయంలో అధికారుల పాత్ర కీలకంగా మారింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి నియోజకవర్గంలో అక్రమ మట్టితవ్వకాలు విచ్చలవిడిగా సాగుతున్నా అధికారులు ఎవరూ కన్నెత్తి చూసిన దాఖలాలు కాని, అడ్డకున్న సందర్భాలు కాని లేవు. వారి అక్రమార్జనలో వీరు భాగం పంచుకుంటూ మట్టి లారీలకు రెడ్‌కార్పెట్ పరుస్తున్నారు. మట్టి అక్రమార్కులకు అధికార పార్టీ పెద్దల ప్రోత్సాహంతో పాటు అన్ని ప్రభుత్వ శాఖలు అండదండలు కల్పిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

అంబటికీ.. స్థానభ్రంశం

- చిలకలూరిపేటకు మంత్రి బదిలీ
- మోదుగుల సత్తెనపల్లికి
- వైసీపీలో తీవ్రస్థాయిలో చర్చ

అమరావతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల అభ్యర్థుల జాబితా అంతా సిద్ధమైపోయిం దని ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి వారం క్రితం ప్రకటించారు. అయినా ఇంకా మార్పులు జరుగుతూనే ఉన్నాయి. కీలక నేతల స్థానాలనూ మారుస్తున్నారు. మంత్రి అంబటి రాంబాబుకూ స్థాన భ్రంశం జరిగినట్లుగా పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. సత్తెనపల్లె సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మంత్రి అంబటి రాంబాబును చిలకలూరిపేటకు బదిలీ చేసినట్లుగా పార్టీవర్గాలు చెబుతున్నాయి. సత్తెనపల్లి సమన్వయకర్తగా పార్టీ సీనియర్ నేత మోదుగుల వేణుగోపాల రెడ్డిని నియమించినట్లు చెబుతున్నారు. సిట్టింగ్ స్థానంలో మంత్రి రజిని కొనసాగితే ప్రతికూల ఫలితాలు వస్తాయని సర్వే ఫలితాలు రావడంతో.. ఆమెను చిలకలూరిపేట నుంచి గుంటూరు పశ్చిమకు గతంలో మార్చేశారు. ఆతర్వాత స్థానికుడైన మల్లెల రాజేష్ నాయుడు సమన్వయకర్తగా వైసీపీ అధిష్ఠానం ప్రకటించింది. అయితే తాజాగా ఈ స్థానంపై పలు సర్వేలు చేశాక మంత్రి అంబటి రాంబాబును బరిలోకి దింపాలన్న యోచనకు జగన్ వచ్చారని పార్టీవర్గాలు చెబుతున్నాయి. మోదుగుల వేణుగోపాలరెడ్డిని సత్తెనపల్లె నుంచి బరిలోకి దింపాలని జగన్ భావించారంటున్నారు. వీరిద్దరి పేర్లతో కూడిన జాబితా అధికారికంగా వెల్లడికానప్పటికీ అంతర్గతంగా వైసీపీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. అధికారికంగా అంబటిని చిలకలూరిపేటకు పంపినట్లుగా ప్రకటిస్తే.. బదిలీ అయిన మంత్రులు ఆదిమూలపు సురేశ్, విడదల రజిని, మేరుగ నాగార్జునల సరసన అంబటి కూడా చేరుతారు. సిట్టింగ్ స్థానంలో ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలను కొత్త స్థానానికి మారిస్తే ఆ వ్యతిరేకత తగ్గుతుందని జగన్ అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే అటువారిని ఇటు.. ఇటువారిని అటు మారుస్తూ కొత్త రాజకీయ క్రీడకు జగన్ తెరతీశారని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

నేటి నుంచి గుడారాల పండుగ



ప్రారంభ ప్రార్థనలు చేస్తున్న హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ

గుంటూరు(తూర్పు), మార్చి 6: గుం టూరు సమీపంలోని హోసన్నా మిని స్ట్రీస్ గోరంట్ల ఆధ్వర్యంలో 47వ అంత ర్జాతీయ గుడారాల పండుగ గురు వారం సాయంత్రం ఆరు గంటల నుం చి ప్రారంభం కానుంది. నాలుగు రోజు లు జరిగే పండుగకు లక్షల మంది విశ్వాసులు హాజరవుతారు. పగలు, రాత్రి సమయాల్లో జరిగే ప్రార్థనలకు వేర్వేరు వేదికలను సిద్ధం చేశారు. ప్రార్థనలను తిలకించేందుకు ఆవరణ లో భారీ స్ర్కీన్లు ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రే వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి పలువురు చేరుకు న్నారు. హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, పాస్టర్లు రాజు, పైడిపాల్, రమేష్‌తో పాటు దక్షిణాఫ్రికా నుంచి వచ్చిన జామవమోజేస్ ప్రారంభ ప్రార్థనలు, క్రీస్తు గీతాలు ఆలపించారు.

పండుగకు ప్రత్యేక రైళ్లు

గుడారాల పండుగకి తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్ఎం రామకృష్ణ తెలిపారు. నెంబరు.07225 అనకాపల్లి - గుంటూరు రైలు బుధవారం రాత్రి 7.40కి బయలుదేరి గురువారం ఉదయం 7 గంటలకు గుంటూరు చేరు కుంటుంది. నెంబరు. 07226 గుంటూరు - అనకాపల్లి రైలు ఈ నెల 10న రాత్రి 10.20కి బయలుదేరి మరు సటి రోజు ఉదయం 8.10కి అనకాపల్లి చేరుకుంటుంది.



ఖిద్మత్ టీం అధ్యక్షుడు షఫీకి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న నారా లోకేశ్

టీడీపీలో చేరిన ఖిద్మత్ టీం అధ్యక్షుడు షఫీ

● మరో 200 కుటుంబాలు టీడీపీలో చేరిక .. ఆహ్వానించిన లోకేశ్

మంగళగిరిసిటీ, మార్చి6: ఖిద్మత్ టీం వ్యవస్థాపక అధ్యక్షుడు, మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన షేక్ షఫీ బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో తన అనుచరులు, మద్దతుదారులైన రెండొందల మందితో కలిసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఖిద్మత్‌టీం ద్వారా షఫీ నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు చేస్తూ అందరికీ దగ్గరయ్యారు. కొవిడ్ సమయంలో అనాథ, పేద కుటుంబాలకు చేయూతనందించి, అనాథ శవాలకు దహన సంస్కారాలను ఖిద్మత్‌కమిటీ సభ్యులతో కలిసి నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. అధికారంలో లేకపోయినా మంగళగిరిలో లోకేశ్ ఎన్నో సేవా కార్యక్రమాలు అమలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో లోకేశ్ గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని షఫీ పేర్కొన్నారు.

వీరితోపాటు దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరుకు చెందిన 25 దళిత కుటుంబాలు, మరో 25 యాదవ సామాజికవర్గ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరందరికీ లోకేశ్ పసుపు కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షిస్తూ పార్టీలో చేరుతున్న వారికి రాబోయే రోజుల్లో తగిన ప్రాధాన్యతనిస్తామని లోకేశ్ చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జానకీదేవి, రాజు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



కానిస్టేబుల్ అశోక్ (ఫైల్)

చిలకలూరిపేట,మార్చి6:యడ్లపాడు పోలీసుస్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ ఎన్.అశోక్(35) బుధవారం చిలకలూరిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. కోటప్పకొండలో విధి నిర్వహణలో పాల్గొన్న అనంతరం ద్విచక్రవాహనంపై తిరిగి చిలకలూరిపేటకు వస్తుండగా పట్టణ పరిధిలోని సింగ్‌నగర్ వద్ద మట్టి లోడుతో వెళ్తున్న టిప్పర్ అతడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందాడు. గుంటూరులో నివాసం ఉంటున్న అశోక్‌కు భార్య, పాప, బాబు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఇక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంచారు. కాగా ప్రమాద వార్త తెలిసిన వెంటనే చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, అర్బన్ సీఐ పీ రమేష్, అర్బన్ ఎస్ఐలు సుబ్బారావు, సుమన్, ఇతర పోలీసు సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు.

తిరునాళ్లకు.. చేరుకోండిలా..



నరసరావుపేట, మార్చి 6: కోటప్పకొండ తిరునాళ్లలో ట్రాఫిక్ నిబంధనలను భక్తులు పాటించాలని ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి బుధవారం సూచించారు. నరసరావుపేట, చిలకలూరిపేట, సంత మాగులూరు వైపు నుంచి కోటప్పకొండకు వచ్చే రహదారులు, పార్కింగ్ స్థలాల వివరాలు వెల్లడించారు.

- నరసరావుపేట నుంచి కోటప్పకొండకు వచ్చే భక్తులు, వీఐపీలు వారి వాహనాలు, ఆర్టీసీ బస్సులలో ఉప్పలపాడు, పెట్లూరివారిపాలెం మీదుగా పార్కింగ్ ప్రదేశానికి చేరుకోవాలి. తిరుగు ప్రయాణంలో పార్కింగ్ వెనుక ఏర్పాటుచేసిన మట్టి రోడ్డును ఉపయోగించుకొని కొండకావూరు మీదుగా పమిడిమర్రు రోడ్డును చేరి జెఎన్‌టీయూ కాలేజీ మీదుగా వినుకొండ రోడ్డుకు చేరుకోవాలి.
- ప్రకాశం జిల్లా సంతమాగులూరు వైపు నుంచి వచ్చే భక్తులు లక్ష్మీపురం కాలువ రోడ్డు, మిన్నెకల్లు, గురిజేపల్లి మీదుగా యూటీ జంక్షన్ చేరి శారద ఫార్మసీ వద్ద వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి. మిన్నెకల్లు నుంచి కోటప్పకొండవైపు వాహనాలు అనుమతించబడవు. తిరుగుప్రయాణంలో గురుజేపల్లి మీదుగా సంతమాగులూరు వెళ్లాలి.
- చిలకలూరిపేట వైపే నుంచి వచ్చే భక్తులు పురుషోత్తపట్నం, యడవల్లి, యూటీ జంక్షన్‌చేరి శారద ఫార్మసీవద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలను ఉపయోగించుకోవాలి. ఈ మార్గంలో వచ్చే వీఐపీలు పురుషోత్తపట్నం, యడవల్లి మీదుగా యూటీ జంక్షన్ చేరి ఎడమవైపుకు క్రషర్ రోడ్ మీదుగా వీఐపీ పార్కింగ్‌లో వాహనాలు ఉంచాలి. తిరుగు ప్రయాణంలో క్రషర్ రోడ్డు మీదుగా యూటీ జంక్షన్‌ను చేరి యక్కలవారిపాలెం, కమ్మవారిపాలెం మీదుగా చెరువు రోడ్డు నుంచి చిలకలూరిపేట వెళ్లాలి.
- చిలకలూరిపేట నుంచి వెళ్లే ప్రభలు పురుషోత్తపట్నం, యడవల్లి మీదుగా యూటీ జంక్షన్ మీదుగా నిధి దారి గుండా ప్రభల నిలిచే స్థలానికి తరలించాలి. చిలకలూరిపేట నుంచి వచ్చే ట్రాక్టర్లు పురుషోత్తపట్నం, యడవల్లి, అట్టలఫ్యాక్టరీ రోడ్డు మీదుగా యక్కలవారిపాలెం మీదుగా ప్రభల స్టాండ్‌కు చేరాలి.
- చిలకలూరిపేట వైపు తిరిగి వెళ్లే భక్తులు శారద ఫార్మసీ దగ్గరలో పార్కింగ్ నుంచి ఆర్టీసీ బస్సులు, కార్లు యూటీ జంక్షన్ చేరి యక్కలవారిపాలెం, కమ్మవారిపాలెం, గోవిందాపురం, కోమటినేనివారిపాలెం మీదుగా నరసరావుపేట- చిలకలూరిపేట రోడ్డు నుంచి చిలకలూరిపేట వెళ్లాలి.
- గంగన్నపాలెం, కోమటినేనివారి పాలెం నుంచి వచ్చు భక్తులు గోవిందాపురం, కమ్మవారిపాలెం మీదుగా మద్దిరాల చేరి యడవల్లి, యూటీ జంక్షన్‌ల మీదుగా పార్కింగ్ ప్రదేశానికి చేరాలి.
- అవిశాయపాలెం, కేసానుపల్లిమీదుగా కోటప్పకొండకువచ్చే భక్తులు ఎస్ఆర్‌కేటీ యలమంద గ్రామం మీదుగా కోటప్పకొండకు వెళ్లాలి.
- యలమంద, గురువాయపాలెంవైపు నుంచి వచ్చే భక్తులు బాతింగ్ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ఐరన్ బ్రిడ్జ్‌ను చేరి, యాదవ సత్రానికి వెనుక పార్కింగ్ ప్రదేశంలో వాహనాలను పార్కు చేసుకొనవలెను.
- రెడ్ల సత్రం, యాదవ సత్రాల వైపు నుంచి నరసరావుపేటకి వెళ్లే వాహనాలు, చిలకలూరిపేట మేజర్ కెనాల్ మీద ఏర్పాటు చేసిన రూట్‌లో మాత్రమే వెళ్లి ఏఎంరెడ్డి కాలేజి వద్ద నరసరావుపేట బైపాస్‌కు వెళ్లాలి. గురవాయపాలెం, యల్లమంద మీదుగా నరసరావుపేటవైపునకు వెళ్ళుటకు వాహనాలు అనుమంతించబడవు.
- నరసరావుపేట టౌన్ నుంచి కోటప్పకొండకి వచ్చే ప్రభలు ఉదయం 10 గంటలకు బయలదేరి వయా యల్లమంద, గురవాయపాలెంమీదుగా సాయంత్రం 4గంటలకి ప్రభల నిధికి చేరుకోవాలి.
- రెడ్ల సత్రం, యాదవ సత్రాల వైపు నుంచి రాత్రి 1 గంట తర్వాత తిరిగి వెళ్ళే వాహనాలు ఐరన్ బ్రిడ్జి మీదుగా గోనేపూడి, కేసానుపల్లి మీదుగా నరసరావుపేట, చిలకలూరిపేట వైపుకు గానీ వెళ్ళ వచ్చు.
- ఏఎంరెడ్డి కాలేజ్ జంక్షన్ నుంచి కాలుకట్ట పైకి అనుమతి లేదు.

వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక యాప్

కోటప్పకొండ తిరునాళ్ళకు వచ్చే భక్తులు తమ వాహనాలను పార్కింగు చేసుకోవడానికి పల్నాడు జిల్లా పోలీసు వారిచే ఏర్పాటు చేసిన కోటప్పకొండ పార్కింగ్ యాప్‌ను గూగల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని హోం పేజీలో కనపడే బైక్, ఆటో, కార్, ట్రాక్టర్ గుర్తులపై టచ్‌చేసే మీకు దగ్గరలోని పార్కింగ్ స్థలాలను సూచిస్తుంది. వాటిలో అందుబాటులో ఉన్న పార్కింగు ప్రదేశాన్ని ఎంచుకుని అక్కడ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి.

కోటప్పకొండకు 100 ప్రత్యేక బస్సులు

చిలకలూరిపేట అర్బన్, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కోటప్పకొండ వెళ్ళే యాత్రికులకు డిపో నుంచి 100 ప్రత్యేక బస్సులు ఏర్పాట్లు చేసినట్లు చిలకలూరిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సింహాద్రి రాంబాబు తెలిపారు. సుమారు లక్షమంది ప్రయాణీకులను కోటప్పకొండకు చేర్చినందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. వలంటీర్లు, డ్రైవర్లు మొబైల్ టీంల సేవలను వినియోగించుకొని ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. సమావేశంలో డిప్యూటీ ట్రాఫిక్ చీఫ్ మేనేజర్ ఎం.ఇబ్రహీం పాల్గొన్నారు.

జయహో బీసీ సభ ఓ సంచలనం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు, అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, మార్చి 6: నాగార్జున విశ్వవిద్యాలయం వద్ద జరిగిన బీసీ సభ దేశంలోనే ఒక సంచలనం సృష్టించిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అన్నారు. బుధవారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జీవీ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, అచ్చెన్నాయుడు, పెద్దలందరూ పాల్గొన్న ఈ గొప్ప సభ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిందన్నారు. బీసీలది యాచించే స్థాయి కాదని శాసించే స్థాయికి వారిని అభివృద్ధి చేయటం చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ లక్ష్యం అన్నారు. రాజకీయాల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించింది అన్న ఎన్‌టీఆర్, టీడీపీ అన్నారు. ఎన్టీ రామారావు మొదటి బీసీలకు 24 శాతం రిజర్వేషన్ తీసుకువచ్చి వాళ్ళకు కొండంత అండగా నిలబడ్డారని, చంద్రబాబు వచ్చిన తర్వాత దానిని 34 శాతానికి పెంచి మరింత సామాజిక న్యాయం చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి వందలాది మందిని హత్య చేయించి పొట్టన పెట్టుకున్నాడని విమర్శించారు. బీసీల వెన్నెముక విరగగొట్టాలని 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్‌ను 24 శాతానికి తగ్గించారన్నారు. జయహో బీసీ సభ జరిగిన తర్వాత జగన్‌రెడ్డి వణికి పోతున్నారన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకోవడం కోసం, చంద్రబాబును సీఎంని చేసుకోవాలని కోరారు. సమావేశంలో టీడీపీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అరవిందబాబు, మాజీ ఎంపీపీ కడియం కోటిసుబ్బారావు, అట్లా చిన వెంకటరెడ్డి, కుమ్మెత కోటిరెడ్డి, డాక్టర్ కడియాల లలిత్‌సారగ్, వెంకట నరసయ్య, కొండలు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటరామిరెడ్డి, కొట్టా కిరణ్‌కుమార్, కొల్లి బ్రహ్మయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రమేష్‌బాబు, పులుకూరి జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల భూములపై వైసీపీ రాబందులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రకుమార్

● అసైన్డ్ భూములు కాజేయడానికే జగన్ ఆర్డినెన్స్
● కలెక్టర్ సహకారంతోనే కిలారి భూదోపిడీ
● కిలారిపై విచారణ జరిపించాలి
● మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

గుంటూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయింది మొదలు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఆయన, ఆయన అనుచరులు పేదల భూములను రాబందుల్లాగా తన్నుకుపోతున్నారని పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. దళితులు తమ ఆర్థిక అవసరాలనిమిత్తం తమకు అసైన్ చేసిన భూములు అమ్ముకోవచ్చని సవరణ చేసి ఆ భూములను కాజేసేందుకు జగన్, ఆయన అనుయాయులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురాగానే వైసీపీ నేతలు అధికారాన్ని అడ్డంపెట్టుకొని దళితుల భూములను లాక్కోవడానికి కలెక్టర్‌తో సహా రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఆ భూములను తమ బినామీ పేర్ల మీదకు మార్చేశారన్నారు. సుప్రీంకోర్టు నియమ, నిబంధనలు తుంగలోతొక్కి జీవో తెచ్చి బినామిలా పేర్లతో కొట్టేయడం మొదలుపెట్టారన్నారు. పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని అనుమర్లపూడి గ్రామంలో 1972 నుంచి 2022 వరకూ దళితుల పేరున వున్న 30 ఎకరాల అసైన్డ్‌భూమిని దోపిడీచేసేందుకు కలెక్టర్ సాయంతో వైసీపీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య తెరలేపారన్నారు. 2011-12లో రెవెన్యూ అధికారులు దళితుల పేర ఇచ్చిన పట్టాదారు పాస్ పుస్తకాలను నేడు 22ఏ కింద తొలగించమని కలెక్టర్ ఏవిధంగా ఆదేశాలిచ్చారో చెప్పాలని డిమాండ్‌చేశారు. అసైన్‌దారుల వారసులకు మాత్రమే హక్కులుండే ఆ భూములకు వారసులను వైసీపీ నేతలే సృష్టించి రూ.50 కోట్లు విలువ చేసే విలువైన భూములు 30 ఎకరాలు దోపిడి చేశారన్నారు. దళితుల భూములు దోచుకున్న కిలారుపై విచారణ చేయించే ధైర్యం సీఎంకి ఉందా అని సవాల్ విసిరారు. దళితులకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తానని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో రాజామాస్టారు, ఇమ్మానుయేల్, డి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, జె.శ్రీనివాసరావు, సాయికృష్ణ, మురళీకృష్ణ, హుస్సేన్, ఫిరోజ్, హజార్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఏడు గృహాలు అగ్నికి ఆహుతి

● విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం
● నిరాశ్రయులైన తొమ్మిది కుటుంబాలు
● బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ పరామర్శ..



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్, మార్చి6: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అర్ధరాత్రి చలరేగిన మంటలతో ఏడు గృహాలు కాలి బూడిదకాగా తొమ్మిది కుటుంబాలు నిరాశ్రయులలైన ఘటన పొన్నూరు పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి ఒంటి గంట సమయంలో పట్టణంలోని 19వ వార్డు ఎస్టీ కాలనీలో ఈ ప్రమాదం సంభవించింది. దీంతో ఇళ్లలోని వస్తు సామగ్రి, దుస్తులు కాలి బూడిదయ్యాయి. ఏడు గృహాల్లో నివసిస్తున్న తొమ్మిది కుటుంబాల వారు నిరాశ్రయులు అయ్యారు. అగ్నిమాపక శాఖ అధికారులు హుటాహుటిన ఘటన స్థలానికి వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో తలపల శ్రీను, కొమరగిరి మల్లేశ్వరరావు, తలపుల భారతి, పొదిలి కృష్ణ, శ్రీను, అద్దూరి శ్రీనివాసరావు, శివ మల్లిఖార్జునరావు, సరోజనమ్మ, చెల్లంచర్ల పోలమ్మలకు చెందిన గృహాలు దగ్ధమయ్యాయి.

బాధిత కుటుంబాలను బుధవారం మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల నగదు సాయాన్ని టీడీపీ నేతల ద్వారా అందచేశారు. ప్రభుత్వం కూడా తక్షణమే స్పందించి బాధిత కుటుంబాలకు పక్కా ఇళ్లు నిర్మించి అన్ని రకాలుగా ఆదుకోవాలని నరేంద్ర డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, తట్ట బులయ్య, మన్యం ఆంజనేయులు, నడికట్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. వైసీపీ నియోజకవర్గ సమన్వయ కర్త అంబటి మురళీకృష్ణ బాధిత కుటుంబాలను పరామర్శించి బాధిత కుటుంబాలకు రూ.5 వేల చొప్పున సహాయం అందించారు.

అమరావతిపై జగన్‌రెడ్డి అసత్య ప్రచారం

● సీఎం అండ్ కో లబ్ధికోసమే విశాఖ జపం
● 1541వ రోజుకు రైతులఆందోళనలు



తుళ్లూరు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్ళూరు, మార్చి 6: రాజధాని అమరావతి నిర్మాణానికి వేల కోట్లు రూపాయలు కావాలని సీఎం జగన్‌రెడ్డి అబద్దపు ప్రచారం చేస్తున్నాడని, సెల్ఫ్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రూపాయి పెట్టుబడి పెట్టే పనిలేదని రాజధాని నిర్మాణానికి భూములు త్యాగంచేసిన రైతులు తెలిపారు. బిల్డ్ అమరావతి అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు బుధవారం నాటికి 1541వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి వారు మాట్లాడుతూ.. జగన్‌రెడ్డి ఎన్ని ఎత్తుగడలు వేసి విష ప్రచా రాలు చేసినా అమరావతిని నాశనం చేయలేడని, అమరావతే రాష్ట్ర రాజధాని అని స్పష్టం చేశారు. సీఎం జగన్‌రెడ్డి అండ్ కో లబ్ధికోసమే విశాఖ జపం చేస్తున్నారన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని ప్రాంత గ్రామాల్లో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.63 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00



కోడెల విగ్రహానికి నివాళులర్పిస్తున్న జీవీ ఆంజనేయులు, ఎంపీ శ్రీకృష్ణదేవ రాయలు, డాక్టర్ అరవిందబాబు, మక్కెన మల్లికార్జునరావు, తదితరులు

ఘనంగా కోడెల విగ్రహావిష్కరణ

నరసరావుపేటటౌన్, మార్చి 6 : నరసరావుపేట మండలం కోటప్పకొండ కాకతీయ సేవాసమితి ఆవరణలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహ ఆవిష్కరణ బుధవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, టీడీపీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ వినుకొండ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, అట్లా చిన వెంకటరెడ్డి, డాక్టర్ కోడెల శివరామకృష్ణ, సాదినేని కోటేశ్వరరావు, పున్నయ్య, మస్తానయ్య, తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడల శివరామకృష్ణ మాట్లాడుతూ కోటప్పకొండలో, కాకతీయ సత్రంలో జరుగుతున్న ప్రతి అభివద్ధి వెనుక కోడెల శివప్రసాదరావు ఉన్నారన్నారు. అన్నదానంతో కులమతాలకు అతీతంగా ఆదరించాలని డాక్టర్ కోడెల తీసుకున్న నిర్ణయం ఆదర్శనీయం అన్నారు. కార్య క్రమంలో అనుమోలు వెంకయ్యచౌదరి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కుమ్మెత కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంలో బీసీలకు పెద్దపీట

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల,మార్చి6: రేపటి టీడీపీ, జనసేన ప్రజా ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్రంలోబీసీలకు పెద్ద పీట వేయటం జరుగుతుందని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళగిరి వద్ద జరిగిన జయహో బీసీ భారీ బహిరంగసభలో ఆమోదించిన బీసీ డిక్లరేషన్‌తో రాష్ట్రంలో లక్షలాది మంది బీసీలకు మేలు జరుగు తుంద న్నారు. రాష్ట్రంలో టీడీపీ జనసేన ప్రభుత్వం ఏర్పాటయ్యాక బీసీలలో 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి నెలకు రూ.4వేల పింఛన్ ఇస్తామన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్‌ను వైసీపీ ప్రభుత్వం 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి 16,800 మందిని పదవులకు దూరం చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక బీసీల రిజర్వేషన్‌ను 34 శాతం పునరుద్ధరిస్తామని యరప తినేని తెలిపారు. చంద్రన్న బీమా రూ.10 లక్షలతో పునరుద్ధరించడంతో పాటు పెళ్లికానుక లక్ష రూపాయలు పెంచడం, శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. బీసీ డిక్లరేషన్‌లో పొందుపరచిన పథకాలను వారికే అమలయ్యేలా చేయనున్నట్లు యరపతినేని తెలిపారు.



న్యాయవాదులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆలపాటి రాజా

భూహక్కు చట్టాన్ని వెనక్కు తీసుకోవాలి

● మాజీ మంత్రి ఆలపాటి రాజా ● న్యాయవాదుల దీక్షలకు మద్దతు

గుంటూరు(లీగల్), మార్చి6: హైకోర్టు ఎన్నిసార్లు చివాట్లు పెట్టిన ఈ ముఖ్యమంత్రికి, ప్రభుత్వ అధికారులకు బుద్ధి రావటం లేదని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. భూ హక్కు చట్టం రద్దు చేయాలని డిమాండ్‌తో గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు జిల్లా కోర్టు ఎదుట చేపట్టిన నిరసనలు బుధవారం 60వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యదర్శి మస్తాన్‌వలి, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు నేరెళ్ళ సురేష్ తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించి న్యాయవాదులకు సంఘీభావం తెలిపారు. ఆలపాటి రాజా మాట్లాడుతూ సామాన్య పౌరులకు రాజ్యాంగబద్ధమైన పాలన అందేలా చూడాల్సిన బాధ్యత న్యాయవాదులపైనే ఉందని చెప్పారు. ప్రజల ఆస్తిపత్రాలపై ముఖ్యమంత్రి ఫొటోలు పెట్టడం తుగ్లక్ చర్య అని పేర్కొంటూ భూహక్కు చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని, రేపు ప్రభుత్వం మారిన వెంటనే దీనిని రద్దు చేస్తారని తెలిపారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ భూహక్కు చట్టంలో ఎన్నో లోపాలు ఉన్నాయని, ఈ చట్టం అమలులోకి వస్తే అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని చెప్పారు. గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీకే సురేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో బుధవారం పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొని భూహక్కు చట్టం వల్ల కలిగే నష్టాలను వివరించారు.



కృష్ణానది స్నానఘాట్‌లో జల్లు స్నానానికి ఏర్పాటు చేసిన పైపులైన్

శివరాత్రి వేడుకలకు అమరేశ్వరాలయం సిద్ధం

అమరావతి, మార్చి 6: మహా శివరాత్రి ఉత్సవాలకు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయం ముస్తాబవుతోంది. ఈ నెల 8న మహాశివరాతిర పర్వదినం సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివార్లను పెళ్లికుమారుడిగాచేయగా బుధవారం వివిధ పూజాకార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ఉత్సవాలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణచేశారు. భక్తుల సౌకర్యార్థం క్యూలు, షామియానాలు, ప్రసాదాలను సిద్ధంచేస్తున్నారు. ప్రధాన రాజగోపురంతో పాటు వివిధ ఆలయ శిఖరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కృష్ణానదిలో నీటి ప్రవాహం అడుగంటడంతో జల్లు స్థానానికి షవర్లు ఏర్పాటు చేశారు.

ఎక్సైజ్ డీసీగా బాబ్జీరావ్ బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌వీవీఎన్ బాబ్జీ రావు

గుంటూరు(కార్పొరేషన్),మార్చి6: గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా ఎస్‌వీవీఎన్ బాబ్జీరావ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ డీసీగా ఉన్న టి.శ్రీనివాసరావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాబ్జీరావ్ వైజాగ్ డీసీగా పని చేస్తూ బదిలీపై గుంటూరు వచ్చారు. ఇక్కడ వున్న శ్రీనివాసరావును విజయవాడ ఏపీఎస్ బీసీఎల్‌లో డీజీఎంగా బదిలీచేశారు. ఈసందర్భంగా ఎస్‌వీవీఎన్ ఎన్ బాబ్జీరావు మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖను పటిష్ఠ పరిచేందుకు కృషి చేస్తామన్నారు.

1,38,827 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,44,511 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,38,827 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 1,09,145 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000
నెంబరు. 5	11000	19200
273	10200	18000
341	8500	19000
4884	12000	15000
సూపర్ 10	9500	16000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8500	20200
బ్యాడిగి	10000	20000
దేవనూరు డీలక్స్	10000	20000
తెల్లకాయలు	5000	12000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



బాబు ష్యూరిటీ కార్యక్రమంలో పాల్గొన్న పెమ్మసాని, నసీర్

టీడీపీతోనే పేదల అభ్యున్నతి సాధ్యం

● పెమ్మసాని చంద్రశేఖర్, మొహమ్మద్ నజీర్

గుంటూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే పేదల అభ్యున్నతి సాధ్యమని టీడీపీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, తూర్పు ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ అన్నారు. రామిరెడ్డితోట, ప్రకాష్ నగర్‌లలో బుధవారం నజీర్ ఆధ్వర్యంలో 'భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొని ఇంటింటికి తిరుగి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతు గుంటూరు తూర్పులో పేదలు, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా ఉన్నారని, వారి సమస్యలన్నీ పరిష్కారం కావాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని చెప్పారు. కార్యక్రమంలో చిట్టాబత్తిన చిట్టిబాబు, రాజా మాస్టారు, నేరేళ్ల సురేశ్, చిలక వెంకటేశ్వర్లు, కోనకళ్ల సత్యం,బూర్స్ వెంకటేశ్వరావు, బాబు రావు, బషీర్, నాగయ్య, కృష్ణ దుర్గా అశోక్, లాజర్, ఉమామహేశ్వరి, శివకోటి జనసేన నాయకులు దుర్గా, శరత్, తదితరులు పాల్గొన్నారు



బీసీ డిక్లరేషన్‌ను ఆవిష్కరిస్తున్న నాని, బీసీ నేతలు

టీడీపీతోనే బీసీల సాధికారత

● టీడీపీ పశ్చిమ ఇన్‌చార్జి కోవెలమూడి ● డిక్లరేషన్ పత్రాల ఆవిష్కరణ

గుంటూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీసీలను అణగదొక్కి గద్దె ఎక్కిన పాలకులను గద్దెదించి బీసీలకు స్వేచ్ఛా వాయువులు ఇచ్చిన పార్టీ టీడీపీయేనని, బీసీల సాధికారత టీడీపీతోనే సాధ్యమని టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర (నాని) చెప్పారు. టీడీపీ గుంటూరు పశ్చిమ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బీసీ డిక్లకేషన్ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలను ఆర్థికంగా, రాజకీయంగా పైకి తీసుకొని వచ్చేందుకు 'జయహో బీసీ' సభ ద్వారా బీసీ డిక్లరేషన్ ప్రకటించిందని, ఈ డిక్లరేషన్ కు బీసీల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయని తెలిపారు. జగన్‌రెడ్డి బీసీ కార్పొరేషన్లను సర్వనాశనం చేసాడన్నారు. బీసీల పై జగన్ రెడ్డి దాడులు చేయిస్తే, అది తట్టుకోలేని చంద్రబాబు నాయుడు బీసీల కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావడం పట్ల నాని హర్షం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో ఉప్పుటూరి పేరయ్య, ఆడక శ్రీను, గాలం వెంకటేశ్వర్లు, తెలగోర్ల అప్పారావు, ఉప్పథల సాంబ, బత్తుల జాన్ సైదా, షేక్ లాల్ వజీర్ తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు అండ టీడీపీ జెండా

● టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్

గుంటూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు టీడీపీ ముందు నుంచి వెన్నుదన్నుగా ఉండి రాజకీయ చైతన్యం కల్పించిందని తెలుగుదేశంపార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ అన్నారు. నగరంలోని కొబ్బరికాయల సాంబయ్య కాలనీలో బుధవారం టీడీపీ, జనసేన జెండాలను ఆయన జనసేన అధ్యక్షుడు నేరెళ్లసురేశ్‌తో కలిసి ఆవిష్కరించారు. ప్రభాకర్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలిస్తే భవిష్యత్ బంగారు మయం అవుతుందన్నారు. వైసీపీ పాలనలో గుంటూరు నగరాన్ని అభివృద్ధికి దూరం చేశారని, టీడీపీ- జనసేన ప్రభుత్వంతోనే నగరాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగులపాటి శ్రీను, కన్నెమల్ల నాగరాజు, ఈర్ల గురవయ్య, నల్లమేక శ్రీను, బీరం వెంకటేశ్వర రావు, ఆళ్లహరి, కొండెపుశేఖర్, బాలకృష్ణ, వాణి, చల్లగుంట్ల కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలుకు ప్రత్యేక బృందాలు



ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జేసీ

● కోడ్ ఉల్లంఘిస్తే ఎన్నికల సంఘం చర్యలు తప్పవు
● రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో ఎన్నికల ప్రక్రియ, ప్రవర్తన నియమావళిపై సమావేశం

గుంటూరు, మార్చి6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు 2024కు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు, ప్రవర్తన నియమావళి అమలుకు సంబంధించి అధికారులను, ప్రత్యేక బృందాలను నియమించినట్లు కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ శంకరన్ హాల్‌లో ఆయన జేసీ రాజకుమారి, డీఆర్వో పెద్ది రోజాతో కలసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించిన తేదీ నుంచే ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయటం జరుగుతుందని, రాజకీయ పార్టీలు ఎన్నికలసంఘం నిర్దేశించిన నిబంధనలు పాటిస్తూ సహకారం అందించాలన్నారు. ఎన్నికలసంఘం ఆదేశాలమేరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి, నామినేషన్‌లు, ఎన్నికల ప్రక్రియపై రాజకీయపార్టీల ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజకీయ పార్టీల ప్రచారకార్యక్రమాల్లో 14 ఏళ్ల లోపు పిల్లలను వినియోగించరాదని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందన్నారు.

ఎన్నికల కోడ్‌ని తూచ తప్పకుండా పాటించాలి

ఎన్నికల కోడ్‌ని తూచ తప్పకుండా పాటించాలని జాయింట్ కలెక్టర్ రాజకుమారి గణియా విజ్ఞప్తిచేశారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన పటి నుంచే కోడ్ అమలులోకి వస్తుందన్నారు. పార్లమెంట్‌కు జిల్లా ఎన్నికల అధికారి, నియోజకవర్గాలకు ఎన్నికల సంఘం నియమించిన అధికారి రిటర్నింగ్ అధికారి అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించటం జరుగుతుందన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రత్యేక బృందాలు నిబంధనలు ఉల్లంఘనలు జరగ కుండా నిరంతరం పర్యవేక్షిస్తారని, నిబంధనలను పాటించని వారిపై చర్యలు తీసుకునే అధికారం ఎన్నికల సంఘానికి ఉంటుంద న్నారు.

కోడ్ అనంతరం వలంటీర్ల సేవలు వద్దు.. వలంటీర్లద్వారా ప్రస్తుతం ప్రజలకు అందిస్తున్న సేవలో ఏ ఒక్కటిని ఎన్నికల కోడ్ వెలవడిన తర్వాత అమలుచేయొద్దని రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టర్ నివేదించారు. ముఖ్యంగా సామాజిక పెన్షన్లను పంపిణీ చేయడానికి వీల్లేదని స్పష్టంచేశారు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోకపోతే తాము కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందిస్తూ వలంటీర్లకు ఎన్నికలకు సంబంధించిన ఏ విధులు అప్పగించటం లేదని స్పష్టంచేశారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, ఆర్డీవో పీ. శ్రీకర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారిపై హత్యాయత్నం

గుంటూరు, మార్చి 6: స్థానిక నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని చుట్టుగుంట సమీపంలోని ఏసుభక్త నగర్ వద్ద రియల్‌ఎస్టేట్ వ్యాపారిపై బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగిరిలోని ఇందిరానగర్ ఏపీఎస్పీ క్యాంప్ మెయిన్‌గేటు ప్రాంతానికి చెందిన బెజ్జం రాజాజీ చుట్టుగుంటసెంటర్ ఏసుభక్త నగర్ 1వ లైనులో సువర్ణ ధరణి డెవలపర్స్ పేరుతో రియల్ ఎస్టేట్ ఆఫీసు పెట్టుకుని వ్యాపారం చేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో రాజాజీ తన కార్యాలయంలో ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు ఏడుగురు ముఖానికి ఖర్చీఫ్‌లు కట్టుకుని కార్యాలయంలోకి ప్రవేశించారు. విజయవాడలోని రామవరప్పాడుకి చెందిన శైలజ అనే ఆమె అపార్టుమెంటుపై పెట్టిన కేసు రాజీ పడాలని, లేకుంటే చంపేస్తాం అని రాజాజీని బెదిరించారు. రాజాజీ రాజీపడనని చెప్పగా చాకుతో దాడిచేశారు. రాజాజీ పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు చేరటంతో గమనించిన నిందితులు పారిపోయారు. ఈ ఘటనపై బాధితుడు నగరంపాలెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేష్ తెలిపారు.

అరండల్‌పేటలోని ఓ ఇంటిలో చోరీ

గుంటూరు, మార్చి 6: అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అరండల్‌పేట 1వ లైనులోని రైల్‌మహల్ ఎదురుగావున్న ఉన్న ఇంటిలోని రెండో అంతస్తులో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. రెండో అంతస్తుకు తాళంవేసి గ్రౌండ్ ఫ్లోర్‌లో కుటుంబ సభ్యులు నిద్రించారు. రాత్రి 2 గంటల వరకు బాధితుడు ఫణీంద్ర అక్కడే ఉండి, తర్వాత తాళం వేసి కిందికి వచ్చారు. తెల్లవారిన తరువాత చూడగా రెండో అంతస్తు తలుపు గడియ విరగ్గొట్టి దొంగలు లోనికి ప్రవేశించారు. ఇంటిలోని 10గ్రాముల బంగారపు గొలుసు, రూ.15 వేల నగదు అపహరించుకుపోయారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి

● జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి

గుంటూరు(కార్పొరేషన్), మార్చి 6: తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాపై అందే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని బీఎల్వోలు, సూపర్‌వైజరీ అధికారులను నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్వో కీర్తిచేకూరి ఆదేశించారు. తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఓటర్లజాబితాపై అందిన ఫిర్యాదులు, అర్జీల పరిష్కారంపై ఏఈఆర్వోలు, సూపరిండెంట్లతో బుధవారం కమిషనర్ చాంబర్‌లో సమక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇతర నియోజకవర్గాల అర్జీలు ఆన్‌లైన్ ద్వారా అందితే ఆయా నియోజకవర్గ అధికారులతో సమన్వయం చేసుకొని అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాన్నారు. సమావేశంలో ఏఈఆర్వోలు శ్రీనివాస్, వెంకట లక్ష్మీ, ప్రదీప్ కుమార్, శ్రీనివాస్, నిరంజన్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా టిడ్కో ఇళ్లు

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధివల్లూరు జయప్రకాష్

గుంటూరు సిటీ, మార్చి 6 టిడ్కో ఇళ్లు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారటం బాధాకరమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ అన్నారు. బుధవారం అడవి తక్కెళ్ల పాడులోని టిడ్కో ఇళ్లను బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్‌తో కలసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించటంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. టిడ్కో గృహాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులను కేటాయించిందన్నారు. వైసీపీ నిర్వాకంతో లబ్ధిదారులు అద్దె ఇళ్లల్లో ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్య క్రమంలో బీజేపీ నేతలు ఈదర శ్రీనివాసరెడ్డి, పాలపాటి రవికుమార్, ఏడుకొండలు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నల్లపాడు సీఐపై సస్పెన్షన్ వేటు

● సివిల్ వివాదాల్లో అక్రమార్కులకు అండగా సెటిల్‌మెంట్స్
● బాధితుల ఫిర్యాదుతో ప్రాథమిక విచారణ
● ఆరోపణలు వాస్తవం కావడంతో చర్యలు



సీఐ రాంబాబు (ఫైల్)

గుంటూరు, మార్చి 6: నల్లపాడు సీఐ రాంబాబుపై సస్పెన్షన్ వేటు పడింది. సివిల్ వివాదాల్లో మితిమీరిన జోక్యం చేసుకోవడమే గాక భూకబ్జాదారులకు అండగా ఉంటూ బాధితులకు అన్యాయం చేస్తున్నారనే ఆరోపణలు ఆయనపై ఎప్పటి నుంచో ఉన్నాయి. దీంతో ఉన్నతాధికా రులు ఇటీవల అంతర్గతంగా విచారణకు ఆదేశించారు. ఈ విచారణలో రాం బాబు పోలీస్ స్టేషన్ పరిధిలో సివిల్ వివాదాలు, భూకబ్జాదారులతో చేతులు కలపడమే గాక, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తేలింది. ఈ నేపథ్యంలోనే బుధవారం సీఐ రాంబాబును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ రేంజ్ ఐజీ పాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. రాంబాబు నల్లపాడు సీఐగా రాంబాబు గత నవంబర్ 6న విధుల్లో చేరారు. బాధ్యతలు స్వీకరించిన నాలుగు నెలల్లోనే ఆయన సస్పెన్షన్‌కు గురి కావడం గమనార్హం.

ఆయన బాధ్యతలు స్వీకరించిన మొదట్లో వెంగళాయపాలెంలో సివిల్ వివాదం చోటుచేసుకుంది. తమ స్థలానికి సంబంధించి తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి తమ స్థలం కబ్జా చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారంటూ బాధితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయితే పోలీసుల నుంచి బాధితులకు న్యాయం జరగలేదు. పైగా బాధితులపైనే తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసులు బనాయించారు. బాధితులు ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ వారికి న్యాయం జరగలేదు. భూకబ్జాకి యత్నించిన వారు అధికార పార్టీకి చెందినవారు కావడంతో పోలీసు అధికారులు స్పందించకపోగా వారికే అండగా నిలిచినట్లు బాధితులు ఆరోపించారు. అప్పట్లో దీనిపై పెద్ద ఎత్తున పత్రికల్లో కథనాలు వచ్చినా ఉన్నతాధికారులు సైతం స్పందించలేదు. అప్పటి ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ కూడా చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశమైంది.

ఇదిలా ఉంటే తన సామాజిక వర్గానికి చెందిన పెదకాకాని మండల పరిధిలోని కొప్పురావూరు గ్రామానికి చెందిన పోలీస్ బ్రోకర్ ను మధ్యవర్తిగా పెట్టుకొని సీఐ సివిల్ వివాదాలు సెటిల్‌మెంట్ చేయడం, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వచ్చాయి నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్నో అక్రమాలు జరిగినా, జరుగుతున్నా, మీడియాలో కథనాలు, వార్తలు వస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం సీఐగా బాధ్యతలు స్వీకరించిన రాంబాబు అదే ఒరవడి కొనసాగించి కొత్తగా వచ్చిన ఎస్పీ తుషార్ డూడీ చేతికి చిక్కి బుక్కయ్యారు. ఇదే విషయమై ఉన్నతాధికారులను సంప్రదించగా రాంబాబును సస్పెండ్ చేసిన విషయం వాస్తవమేనని, అయితే అందుకు దారి తీసిన కారణాలపై ఒకటి, రెండు రోజుల్లో స్పష్టత ఇస్తామని వెల్లడించారు. ఈ ఘటనతో పోలీస్ శాఖలోని అక్రమార్కుల్లో ఆందోళన మొదలైంది.

ఆలయ స్థలాల లీజులో సిండికేట్

● కారు చౌకగా భూములు కొట్టేసిన ఓ ఎమ్మెల్యే తనయుడు

గుంటూరు(కార్పొరేషన్), మార్చి 6: ఖరీదైన ఆ స్థలాలకు డిమాండ్ ఉంది. దేవదాయశాఖకు చెందిన ఆ స్థలాలను కారుచౌకగా ఓ ఎమ్మెల్యే తనయుడు కొట్టేశాడు. ఇందుకు సంబంధించిన వివరాలు.. కొరటిపాడు ఆంజనేయస్వామి దేవస్థానానికి నగరంలోని జేకేసీ కళాశాల, విద్యానగర్ శివార్లలో భూములు ఉన్నాయి. అపార్ట్‌మెంట్ల మధ్యనున్న ఈ భూములకు మంచి డిమాండ్ ఉంది. మొత్తం 6 ప్లాట్లుగా విభజించి లీజుకు దేవదాయశాఖ అధికారులు బుధవారం టెండర్లను నిర్వహించారు. ఆ టెండర్లలో ఎక్కువ పాట రాకుండా గుంటూరుకి చెందిన ఓ ఎమ్మెల్యే తనయుడు తానే పోటీదారులను తీసుకొచ్చి టెండర్లలో పాల్గొనే విధంగా చేశారు. పోటీ లేకపోవడంతో తక్కువ లీజుకే టెండర్లను దక్కించుకున్నాడు. ఆరు ఎకరాల మూడు సెంట్లను రూ.54.70 లక్షలకు, 66 సెంట్ల స్థలాన్ని రూ.27 లక్షలకు, మూడు ఎకరాల భూమిని రూ.20.20 లక్షలకు, మూడు ఎకరాల 6 సెంట్లను రూ.18.50 లక్షలకు దక్కించుకున్నాడు. మొత్తం ఆరు బిట్లకు ఐదింటికి టెండర్ ఖరారైంది.

మిచౌంగ్ తుపాను బాధిత రైతులకు పరిహారం

గుంటూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత డిసెంబర్ నెలలో సంభవించిన మిచౌంగ్ తుపాను కారణంగా వరి, మిరప, మొక్కజొన్న పంటలను నష్టపోయిన రైతులకు పరిహారం విడుదలైందని కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి చెప్పారు. బుధవారం ఇన్‌పుట్ సబ్సిడీ కింద 52,863 మంది రైతులకు రూ.61 కోట్ల 73 లక్షల పరిహారాన్ని తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్ బటన్ నొక్కి రైతుల ఖాతాలకు జమ చేసినట్లు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

పేదల ఆస్పత్రిలో ఖరీదైన వైద్యం !

గుంటూరు (మెడికల్) మార్చి 6: మయోస్థీనియా గ్రేవిస్ అనే అరుదైన నరాల జబ్బుతో బాధపడుతున్న పేద రోగికి గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో రూ.6 లక్షల ఖరీదైన మందులు వాడి జబ్బు నుంచి కాపాడారు. వివరాల్లోకి వెడితే... పశ్చిమ గోదావరి జిల్లా నల్లజర్ల మండలం చీపురుగూడెంకు చెందిన కే.సుబ్బారావు కొంతకాలంగా కళ్లు మూతబడటం, మెడ వంగిపోవడం, కింద దవడ జారిపోవడం, గొంతు మింగుడు పడకపోవం వంటి లక్షణాలతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం ఫిబ్రవరి 24న గుంటూరు జీజీహెచ్‌లో చేరారు. న్యూరాలజీ ఇన్‌చార్జి విభాగాధిపతి డాక్టర్ అరుణకుమారి పరీక్షించి అతడు అరుదైన మయోస్థీనియా గ్రేవిస్ అనే జబ్బుతో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. ఖరీదైన ఇమ్యునోగ్లోబిలిన్‌లతో చికిత్సలు ప్రారంభించారు. ఒక్కొక్కటి రూ.22 వేలు గల ఇంజెక్షన్‌లను రోజుకు ఐదు చొప్పున ఐదు రోజులపాటు చేశారు. సరైన సమయంలో ఇంట్రా వీనస్ పద్ధతిలో ఇమ్యునో గ్లోబిలిన్ ఇవ్వడంతో రోగి సుబ్బారావు కోలుకున్నారు. ప్రైవేటు వైద్యశాలల్లో ఈ జబ్బుకు కనీసం రూ.11 లక్షలు వసూలు చేసే వారని సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థినికి గాయాలు... వైద్య కళాశాల సమీపంలో బుధవారం ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఎంబీబీఎస్ సెకండియర్ విద్యార్థి బీ.బెస్లీకి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆమెను ప్రభుత్వాస్పత్రి క్యాజువాల్టీకి తరలించారు. పొట్టలో స్లీన్ (ప్లీహం)కు తీవ్రగాయమై అంతర్గతంగా రక్తస్రావం కావడంతో జనరల్‌సర్జరీ హెచ్‌వో డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ గోవింద్‌నాయక్, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ తన్మయ తదితరులు వెంటనే ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం బెస్లీ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తెలిపారు.

ఆధార్ ఆపరేటర్లకు శిక్షణ

గుంటూరు సిటీ,మార్చి 6 జిల్లాలోని ఆధార్ ఆపరేటర్లకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్డీవో) సుజాత ఆయా అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తప్పులు లేకుండా ఆధార్ సేవలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని మండల పరిషత్ పరిధిలో పనిచేస్తున్న ఆపరేటర్లు, సమావేశ మందిర ఇంచార్జ్ ప్రసాద్ పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టింగ్‌లో

టీజేపీఎస్ విద్యార్థి ప్రతిభ

గుంటూరు(విద్య),మార్చి 6: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహించిన అంతర కళాశాలల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో టీజేపీఎస్ కళాశాల బీకామ్ (తృతీయ సంవత్సరం) విద్యార్థి రాజేష్ 59 కేజీ విభాగంలో ప్రతిభ కనబరిచి ద్వితీయస్థానం సాధించాడని కళాశాల ప్రిన్సిపాల్ మేజర్. ఏబీపీ మనోహర్ తెలిపారు. బుధవారం రాజేష్‌ను కళాశాల కార్యదర్శి కేవీ బ్రహ్మం, పీడీ శివాజీ, అధ్యాపకులు అభినందించారు.

విద్యుత్ సరఫరా

ఉండని ప్రాంతాలు

గుంటూరు, మార్చి 6: విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాతగుంటూరులోని నందివెలుగురోడ్డు, ఆర్టీసీ కాలనీ, వెంకటరావుపేట, ఇజ్రాయిల్‌పేట ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ పీహెచ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

గుంటూరు సిటీ,మార్చి 6 :అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు జిల్లా పరిషత్‌లో మహిళా ఉద్యోగులకు బుధవారం ఆటల పోటీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన పోటీలను జడ్పీ చైపర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బత్తుల అనురాధ, జడ్పీ సీఈవో భార్య లక్ష్మీకుమారి, డిప్యూటీ సీఈవో భార్య సోనియా, కాకుమాను జెడ్పీటీసీ గుల్జార్‌బేగం, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో.. ఏపీ జేఏసీ గుంటూరు జిల్లా నాయకులు సంగితరావు, కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ భవన్‌లో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఏపీ జేఏసీ మహిళా విభాగం చైర్‌పర్సన్ భువనేశ్వరి, జనరల్ సెక్రటరీ ధనలక్ష్మి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంబీబీఎస్ లో మొదటి ర్యాంకు సాధించిన ఎల్. దివ్యను, 100 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 400 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించిన బి. శిరీషను నగదు పురస్కారంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పార్వతి, వసుధ, కనక దుర్గ, అనుపమ వెంకటేశ్వర్లు వివిధ శాఖల మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు

గుంటూరు(విద్య),మార్చి 6: స్థానిక జేకేసీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-2 విభాగం ఆధ్వర్యంలో స్పెషల్‌క్యాంపులో భాగంగా బుధవారం హ్యాపీడెంటల్ సహకారంతో అడవితక్కెల్లపాడు గ్రామంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించినట్లు ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్. డీరాహుల్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఐ.నాగేశ్వరావు, డాక్టర్ శ్వేత, కోటేశ్వరరావు మెమోరియల్ పాఠశాల ఏవో ఎల్‌ఎస్.భారవి, ప్రిన్సిపాల్ ఎన్ తాండవకృష్ణ, హ్యాపీ డెంటల్ వైద్య సిబ్బంది చైతన్య, రాణి, కళ్యాణ్ పాల్గొన్నారు

నేతాజీనగర్‌లో మధుమేహ పరీక్షలు...

గుంటూరు ప్రభుత్వమహిళా డిగ్రీకళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-4 వారి దత్తత గ్రామమైన లాల్‌పురంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా బుధవారం నేతాజీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు మధుమేహం పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. వీఆర్.జ్యోష్ణకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ నిర్వహణాధికారి డాక్టర్. కే.విజయకుమారి, హెచ్‌ఎం పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

గుంటూరు(విద్య),మార్చి 6: పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏపీ నేషనల్ గ్రీన్‌కోర్ రాష్ట్ర మానిటరింగ్ ఆఫీసర్ జీ.ప్రభ అన్నారు. బుధవారం నగరంలోని వివిధ పాఠశాలల్లోని విద్యార్థులకు'పర్యావరణ విద్య' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో 'పర్యావరణ విద్య' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు వెంకటేశ్వరరావు, జ్యోతికిరణ్, నాగేంద్రమ్మ, గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త షేక్ గౌసుల్‌మీరా, గ్రీన్ టీచర్ ధనయ్య, ప్రాజెక్ట్ ఆఫీసర్ సత్యనారాయణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు

డయేరియా మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

● కలెక్టర్‌ను కోరిన టీడీపీ తూర్పు ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్

గుంటూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): డయేరియాతో చనిపోయిన ఇక్బాల్ కుటుంబానికి తక్షణమే ఆర్థికసాయం చేయాలని టీడీపీ గుంటూరు తూర్పు ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ డిమాండ్ చేశారు. ఇక్బాల్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఆయన కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డిని కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ కలుషిత నీరు తాగి డయేరియా వ్యాధి బారినపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఇక్బాల్ కుటుంబానికి ప్రభుత్వంనుంచి ఇప్పటి వరకూ ఏలాంటి సాయం అందలేదన్నారు. కుటుంబానికి ఇక్బాలే ఆధారమని, అతడు మరణిం చడంతో ఆ కుటుంబం రోడ్డున పడిందని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. డయేరియాతో చనిపోయిన పద్మ అనే యువతికి కలెక్టర్ స్పందించి పరిహారం చెల్లించారని, అదే విధంగా పేద ముస్లిం అయిన ఇక్బాల్ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ప్రకటించి అందజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్ర మంలో కార్పొరేటర్లు పోతురాజు సమత, స్థానికులు పాల్గొన్నారు.

పోస్టింగ్ ఉత్తర్వులు తప్పనిసరి నిరీక్షణపై అవగాహన

గుంటూరు, మార్చి 6: ప్రభుత్వ ఉద్యోగులు పోస్టింగ్ ఉత్తర్వుల కోసం తప్పనిసరి నిరీక్షణ విధానం గురించి రాష్ట్ర పెన్షన్ దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు సెలవులో వెళ్లి ముగిసిన తర్వాత ప్రధాన కార్యాలయంలో పోస్టింగ్‌ల కోసం దరఖాస్తు చేసుకొని పోస్టింగ్ ఇచ్చే వరకు వేచియున్న వ్యవధిని తప్పనిసరి నిరీక్షణ అంటారన్నారు. ప్రాథమిక నిబంధన 9(13) ప్రకారం తదంతర పోస్టింగ్ కోసం నిరీక్షించిన కాలాన్ని డ్యూటీగా పరిగణించి జీత భత్యాలు సంబంధిత ఉద్యోగికి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. తప్పనిసరి నిరీక్షణ కాలాన్ని డ్యూటీగా ప్రభుత్వం పరిగణించటం వల్ల ప్రభుత్వ ఖజానాపై అధిక భారం పడుతుందనే ఉద్దేశ్యంతో ఆర్థికశాఖ తమ ఉత్తర్వుల ద్వారా అన్ని శాఖలకు సూచనలు జారీ చేసిందన్నారు. ప్రతి స్థాయిలో అధికారి మూడు రోజుల కంటే మించి దస్త్రాన్ని ఎక్కువగా ఉంచుకున్న వారిని బాధ్యులుగా చేయాలని 30 రోజులకు మించి కంపల్సరీ వెయిట్‌గా పరిగణించాల్సి వస్తే సంబంధిత అధికారుల నుంచి కంపల్సరీ వెయిట్ కాలంలో అయ్యే జీతభత్యాల మొత్తాన్ని అధికారుల నుంచి రాబట్టాల్సి ఉంటుందని వీరయ్య తెలిపారు.

బియ్యం నిల్వలపై సమాచారం ఇవ్వండి

గుంటూరు సిటీ,మార్చి 6: గుంటూరు జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై సమాచారమిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి కోమలి పద్మ స్పష్టంచేశారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి' లో 'ఎఫ్‌సిఐ టూ ఎఫ్‌సిఐ' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. ప్రజలు ఇచ్చిన బియ్యాన్ని వారి అవసరాలకే వినియోగించుకోవాలని సూచించారు. గత ఏడాది జులై నుంచి ఇప్పటివరకు బియ్యం అక్రమ రవాణాపై 95 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన

గుంటూరు, మార్చి 6: రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీ తెలిపారు. బుధవారం 43వ డివిజన్ విద్యానగర్, సుగాలికాలనీల్లో పలు పనులను ప్రారంభించటంతో పాటు కొత్తగా పనులకు మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌తో కలిసి మంత్రి శంకుస్థాపనలు చేశారు. సుగాలికాలనీలో రూ.45 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మించనున్నట్లు తెలిపారు. అలానే కాలనీలో రూ.25 లక్షలు, మరో రూ.3 లక్షలతో రెండు రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. పలువురు వైసీపీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవ తయారీలో నూతన ఆవిష్కరణ

గుంటూరు(విద్య),మార్చి6: ఇటీవల చెన్నైలోని అన్నా యూనివర్సిటీలో 'కురుక్షేత్ర 2024' పేరుతో నిర్వహించిన టెక్నోవేషన్ - ఇంటర్ కాలేజీ ప్రాజెక్ట్ కాంపిటేషన్‌లో ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు రూపొందించిన 'కృత్రిమ చేయి' అవయవ నూతన ఆవిష్కరణ ప్రదర్శనకు తృతీయ స్థానం లభించింది. ఈ సందర్భంగా విద్యార్థులు అవార్డుతోపాటు నగదు పురస్కారాన్ని అందుకున్నారు. కళాశాలలో ఐవోఈ విభాగంలో తృతీయ సంవత్సరం విద్యార్థులు జి భరణి విష్ణు, బీ. త్రినాథ్, బీ.శ్రీనివాసులు, బీవై. వినూత్న, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు శ్రీ వైష్ణవి, డేటా సైన్స్ విభాగం విద్యార్థులులో 3వ సంవత్సరం చదువుతున్న కేపీఎస్ సాయి కళ్యాణి, ఐటి విద్యార్థులు వీ. శ్రీవల్లి బృందం కృత్రిమ చేయిని రూపొందించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తెలిపారు. ఈ సదర్భంగా విద్యార్థులను కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణలు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న రాయపాటి గోపాలకృష్ణ తదితరులు

వేలం ప్రకటన

IN THE COURT OF THE I ADDL. SENIOR CIVIL JUDGE, GUNTUR
E.P. No. 170 / 2018 in O.S. No. 442 / 2017
Between:
Pasupulati Kanka Durga ...DHR
And
Pasupulati Murali Krishana ...JDR

పైనెంబరు ఇ.పి.లో ఇస్తిహారు జారీకాబడి జప్తు కాయమైన జె.డి.ఆర్.తాలూక ఆస్తిని వేలంవేయుటకు శ్రీకోర్టువారు ది.27-03-2024న తేదీకి వాయిదావేసినారు. కావున వేలంపాటలో పాల్గొన దలచినవారు వాయిదారోజున ఉ.గం॥10-30ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై వేలంపాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును. కోర్టువారి షరతులకు లోబడి పాటజరుగును.

Schedule: Guntur Dt., & Sub Dt. within the GMC Area, Guntur City, Nagarampalem Municipal Old Ward No.17, New Ward No. 23, Block No.12, T.S.No.307 is bearing Door No.26-1-63, Old Assessment No. 37525/A, New Assessment No.26428 an extent of 66Sq.Yds. of site with A.C.C. Sheet House is being bounded by:EAST:6 feet Wide Joint Galli-14.16ft., SOUTH: Property belongs to Bellamkonda Sandhya Rani-41ft., WEST:Property belongs to Konda Lakshininarayana and Pasupulati Sambaiah-14.6ft. NORTH: Property belongs to Sunna Veera Kumari-41-0ft. Within these boundaries an extent of 66Sq.Yds. or 55.18 Sq.Mts. of site in A.C.C. Sheet house in therein.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
డి. హెచ్.ఆర్ విలువ రూ.5,00,000/-
అమీనా విలువ రూ.20,00,000/-
వేలం వాయిదా ది.27-03-2024
ఫర్దర్ హియరింగ్ ది.03-04-2024.

కళ్యాణం కృష్ణమూర్తి, డి.హెచ్.ఆర్. తరపు అడ్వకేట్, సీతారామ్ నగర్, 5వ లైను, గుంటూరు. సెల్: 9440260914

GENERAL NOTICE

IN THE COURT OF THE I ADDL. SENIOR CIVIL JUDGE: GUNTUR
I.P No: 10 /2024

BETWEEN :
Vanukuri Annapurna,W/o.Late Anji Reddy, R/o.Challavaripalem, Nallapadu,Guntur. ...Petitioner
and

1)Challa Venkateswara Reddy,S/o.Rami Reddy, R/o. Challa Varipalem, Nallapadu, Guntur, 2)Challa Srinivasula Reddy, S/o.Hanmantha Reddy, R/o. Vejendla(V), Chebrolu(Md),Guntur Dist., 3) Vanukuri Srinivasa Reddy,S/o.Subba Reddy, R/o.Door No.4-26, Namburu(V), Pedakakani(Md),Guntur Dist.,4)Vanukuri Krishna Reddy,S/o.Subba Reddy,R/o.Namburu(V), Pedakakani (Md),Guntur Dist.,5)Challa Lakshma Reddy, S/o.Venkateswara Reddy,R/o.Koritepadu,Guntur,6)Challa Hussain Reddy, S/o. Venkateswara Reddy, R/o.Challavari Palem, Nallapadu, Guntur, 7)Danda Suryanarayana Reddy, S/o.Venkata Reddy,R/o. Mandapadu(V), Medikonduru(Md), Guntur Dist., 8)Bhavanam Chennakesava Reddy, S/o.Subba Reddy, R/o.Valiveru(V), Chunduru Mandal, Bapatla Dist., 9)Janga Hymavathi,W/o.Koti Reddy, R/o.Mandapadu(V), Medikonduru(Md),Guntur Dist., 10) Amineni Siva Sankara Rao,S/o.Venkata Subba Rao, 11)Dotireddy Rajasekhara Reddy, S/o.Sobhanadri Reddy, 12) Bommareddy Koteswari,W/o.Vema Reddy,13)Duggempudi Sambasiva Reddy,S/o.Sambi Reddy, 14)Burramukku Mallikharjuna Reddy, S/o.Siva Reddy, 15)Dontireddy Lakshma Reddy,S/o.Sambi Reddy,16)Akumarthi Prakash, S/o.Satya Narayana, R/o.Vidyadharapuram, Kabela Centre, Vijayawada City, NTR District. 17)Dontinreddy Padmaja,W/o.Ramakrishna Reddy, 18)Modugala Deepthi, W/o.Siva Sankara Reddy, R-11, R-17&R-18 are R/o.Tadepalli Post and (Md), Guntur Dist. 19)Arumalla Brahmananda Reddy, S/o.Venkata Rami Reddy, 20)Vuyyuru Govardhana Reddy S/o.Venkata Reddy, 21)Rayala Govardha Namma, W/o.Bulli Babu, 22)Mellampudi Durgamma, W/o.Sambaiah,23)Vanga Bhaskara Reddy, S/o.Sankara Reddy, 24)Jangareddy Parvathi, W/o.Nagi Reddy, 25)Arumalla Venkata Reddy, S/o.Venkatappa Reddy, R-10, R-12 to R-15 & R-19 to R-25 are R/o.Mellempudi(V), Tadepalli(Md), Guntur Dist. 26)Aari Raja Babu,S/o.Srimannarayana,R/o.Pedavadlapudi(V), Mangalagiri(Md), Guntur Dt. 27)Nallabothula Naga Chenchu Srinivasa Rao,S/o.Ankamma Rao, R/o.Peda Vadlapudi(V), Mangalagiri(Md), Guntur Dist.28)The Official Receiver, Dist. Courts Compound, Guntur City. ...Respondents

పైనెంబరు IP లోని పిటీషనర్ తనను ఇన్‌సాల్వెంటుగా డిక్లేర్‌చేయుమని కోరుచు పిటీషన్ దాఖలుచేయగా సదరు పిటీషన్‌పై ఎవరికైన అభ్యంతరములు ఉంటే తెలుపుకోనవలసినదిగా శ్రీ కోర్టువారు జనరల్ నోటీసు నిమిత్తం ది:28-03-2024కి వాయిదావేసినారు. కావున ఆరోజున ఉ॥గం॥10:30ని॥లకు పైకోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీతరపు వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకోనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్ష మున తీర్మానించబడును. (శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు).

వాయిదా తేది: 28-03-2024.

D. NAGA BABU,
Advocate for Petitioner, Guntur, Cell: 9440759153

ఇటలీ వెళ్లిన కల్కి



ప్రభాస్ హీరోగా రూపొందుతున్న ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ 'కల్కి 2898 ఏడీ' షూటింగ్ ప్రస్తుతం ఇటలీలో జరుగుతోంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ సంస్థ నిర్మిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణే, దిశా పటాని తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటలీలోని అద్భుతమైన లొకేషన్స్‌లో ప్రభాస్, దిశా పటానిపై పాట చిత్రీకరిస్తున్నారు. ప్రభాస్, దిశా పటాని, నాగ్ అశ్విన్ ఇతర యూనిట్ సభ్యులతో దిగిన ఫొటోని బుధవారం మేకర్స్ షేర్ చేశారు. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'కల్కి 2898' చిత్రం మే 9న విడుదల కానుంది.

బైక్ రేసర్‌గా శర్వా



యువ కథానాయకుడు శర్వానంద్ ప్రస్తుతం తన 35వ చిత్రం 'మనమే'లో నటిస్తున్నారు. ఆయనతో 'రన్ రాజా రన్', 'ఎక్స్‌ప్రెస్ రాజా', 'మహానుభావుడు' చిత్రాలను నిర్మించిన యూవీ క్రియేషన్స్ అధినేతలు వంశీ, ప్రమోద్ తాజా చిత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. శర్వా పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఆయన 36వ చిత్రం షూటింగ్‌ను పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. తొలిసారిగా శర్వా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో చిత్రాన్ని చేస్తున్నారు. ఇందులో ఆయన బైక్ రేసర్‌గా నటిస్తున్నారు. మోటో క్రాస్ రేసింగ్ నేపథ్యంలో కుటుంబంలోని మూడు తరాలకు చెందిన కథతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి అభిలాష్ కంకర దర్శకత్వం వహిస్తున్నారు. శర్వానంద్, హీరోయిన్ మాళవిక నాయర్‌పై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు చిత్ర సమర్పకుడు విక్రమ్ తొలి క్లాప్ ఇచ్చారు. ఈ సినిమాకు సంగీతం: జిబ్రాన్, ఫొటోగ్రఫీ: జె.యువరాజ్, ఎడిటర్: అనిల్ కుమార్, రచన, దర్శకత్వం: అభిలాష్ కంకర.

ఈ పుట్టినరోజు సందర్భంగానే శర్వానంద్ నటిస్తున్న 35వ చిత్రం 'మనమే'. 37వ చిత్రం డిటైల్స్, లుక్స్ విడుదల చేశారు.

మొదట ఎన్టీఆర్.. ఇప్పుడు రామ్‌చరణ్



అతిలోకసుందరి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ నటించే రెండో తెలుగు చిత్రం కూడా కన్ఫర్మ్ అయింది. జూనియర్ ఎన్టీఆర్ సరసన 'దేవర' చిత్రంలో నటిస్తున్న ఆమె తాజాగా రామ్‌చరణ్ హీరోగా నటించే 16వ సినిమాలో కథానాయికగా నటించనున్నారు. జాన్వీ ఈ చిత్రం చేస్తుందనే వార్తలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. ఆమె తండ్రి బోనీ కపూర్ ఇటీవల ఈ విషయం వెల్లడించారు కూడా. జాన్వీ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం వద్ది సినిమాస్ అధినేతలు అధికారికంగా ఈ విషయం వెల్లడించారు. దర్శకుడు బుచ్చిబాబు సాన ఈ సినిమా కోసం యూనివర్సల్ అప్పీల్ ఉండే పవర్‌ఫుల్ స్ర్కిప్ట్ సిద్ధం చేశారు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడిస్తామని నిర్మాత వెంకట సతీశ్ కిలారు చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Ifp8YM3 లో చదవండి.

భీమ పాత్రను ఎంజాయ్ చేస్తారు

దర్శకుడు హర్ష



గోపీచంద్ హీరోగా నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమ' ఈ శుక్రవారం విడుదలవుతోంది. కె.కె.రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రానికి కన్నడ దర్శకుడు ఎ.హర్ష దర్శకత్వం వహించారు. విడుదల సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటిస్తూ 'నేను బెంగళూరులో పుట్టి పెరిగాను. ఇప్పటివరకూ కన్నడ చిత్రాలే చేశాను. తెలుగులో రాధామోహన్ గారి 'బెంగాల్ టైగర్' చిత్రంలో రెండు పాటలకు కొరియోగ్రఫీ చేశాను. ఆయనే నన్ను తెలుగులో దర్శకుడిగా పరిచయం చేస్తుండడం ఆనందంగా ఉంది. గోపీచంద్‌గారికి మొదట ఒక కథ చెప్పాను. ఆయన కొన్ని మార్పులు చెప్పారు. ఎనిమిది నెలలు గ్యాప్ తీసుకుని 'భీమ' కథ చెప్పాను. అది ఆయనకు నచ్చింది. ఎంటర్‌టైన్‌మెంట్, ఎలివేషన్, ఎమోషన్ కలిగిన మంచి కమర్షియల్ సినిమా ఇది. సోషల్ మెసేజ్‌తో పాటు సెమీ ఫాంటసీ ఎలిమెంట్ కూడా ఉంది. ముఖ్యంగా భీమ పాత్ర చాలా ఎంటర్టైనింగ్‌గా ఉంటుంది' అని చెప్పారు. గోపీచంద్ వండర్‌ఫుల్ ఆర్టిస్ట్ అని చెబుతూ 'ఆయన సినిమాలన్నీ చూశాను. తనకి యూనిక్ బాడీ లాంగ్వేజి ఉంది. మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషి. చాలా పాజిటివ్. ఎప్పుడూ నవ్వుతూనే ఉంటారు. భీమ పాత్ర ఆయనకే సూట్ అవుతుందని ఆయనకే చెప్పాను' అన్నారు హర్ష. నిర్మాత రాధామోహన్ చాలా ప్యాషన్ ఉన్న వ్యక్తి అనీ ఈ సినిమాకు కావాల్సిన వన్నీ సమకూర్చడంతో మంచి క్వాలిటీతో సినిమా తీయగలిగినట్లు ఆయన తెలిపారు.

సైన్స్ ఫిక్షన్ దర్శిని



వికాస్ జీకే, శాంతి హీరో హీరోయిన్లుగా రూపుదిద్దుకున్న 'దర్శిని' చిత్రం త్వరలో విడుదల కానుంది. డాక్టర్ ప్రదీప్ అల్లు దర్శకత్వంలో డాక్టర్ ఎల్వీ సూర్యం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రం టీజర్‌ను పార్లమెంట్ సభ్యుడు ఎం.వి.వి. సత్యనారాయణ విడుదల చేసి సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ 'థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన సైన్స్ ఫిక్షన్ ఇది. సినిమా బాగా వచ్చింది. పాటలు చిత్రానికి ప్లస్ అవుతాయి.' అన్నారు. ఓ ప్రముఖ పంపిణీ సంస్థ ద్వారా త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు. టీజర్, పాటలు చూసి ఆశీర్వదించిన ఎంపీ సత్యనారాయణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దిక్సూచి DIKSUCHI

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ జాగ్రఫీ

జల సంరక్షణ విధానాలు



భారతదేశంలో సంప్రదాయ నీటిపారుదల, జల సంరక్షణ విధానాలు

- **జింగ్:** కరిగిన హిమనీ నదాల నీటిని సేకరించడానికి నిర్మించిన ట్యాంక్‌లు. ఇవి లడక్‌లో ఉన్నాయి.
- **నౌల:** ఉత్తరాఖండ్‌లో చుట్టుపక్కల ప్రవాహాల నుంచి నీటిని సేకరించడానికి నిర్మించిన చిన్న చిన్న బావులు
- **ఖుల్స్:** హిమాచల్ ప్రదేశ్‌లో కొండవాలుల వెంబడి ప్రవహించే నీటి ప్రవాహాలను మళ్లించడానికి ఏర్పాటు చేసిన కాలువలు
- **గుల్స్:** హిమాచల్ ప్రదేశ్‌లో కొండవాలుల వెంబడి ప్రవహించే నీటి ప్రవాహాలను నేరుగా వ్యవసాయ క్షేత్రాలకు మళ్లించే కాలువలు
- **బౌడి:** హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్పూర్, కాంగ్రా, మండి జిల్లాల్లో కొండవాలుల వెంబడి ప్రవహించే నీటి ప్రవాహాలను సేకరించడానికి ప్రత్యేకంగా నిర్మించిన బావులు.
- **నావ్స్:** హిమాచల్ ప్రదేశ్‌లో తాగునీటి కోసం, ఇంటి అవసరాల కోసం నిర్మించిన బావులు.
- **ఖత్రి:** హిమాచల్ ప్రదేశ్‌లో కొండవాలుల వెంబడి ప్రవహించే వర్షపు నీటిని సేకరించడానికి రాళ్లతో నిర్మించిన బావులు
- **డిఘీ:** ఢిల్లీ ప్రాంతంలో నిర్మించిన చిన్న చిన్న బావులు లేదా కుంటలు
- **అహర్-పైన్స్:** అహర్- బిహార్‌లో వర్షపు నీటిని మళ్లించి నిల్వచేసేందుకు నిర్మించిన జలాశయాలు. పైన్స్-అహర్...జలాశయాల నుంచి నీటిని వ్యవసాయ క్షేత్రాలకు మళ్లించడానికి నిర్మించిన చిన్న చిన్న నీటిపారుదల కాలువలు.
- **అపతాని:** అరుణాచల్ ప్రదేశ్‌లో ఉపరితల, భూగర్భ జలాలను ఉపయోగించి వరి, చేపల పెంపకం చేపట్టడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక వసతులు
- **జబో/రుజా:** నాగాలాండ్‌లో వరద ప్రవాహాన్ని మళ్లించేందుకు ఏర్పాటు చేసిన కాలువలు.
- **చీవ్-ఓజిహి:** నాగాలాండ్‌లో కొండ వాలుల వెంబడి ప్రవహించే నీటి ప్రవాహాలను మళ్లించడానికి ఏర్పాటు చేసిన అతి పొడవైన వెదురుపైపుల కాలువలు.
- **తుయ్ ఖుర్:** మణిపూర్, మిజోరాంలలో ఉన్న నీటి బుగ్గలు
- **వెదురు డ్రిప్:** మేఘాలయాలో వాలుల వెంబడి ప్రవహించే నీటిని సేకరించి అత్యధిక దూరంలో ఉన్న వ్యవసాయ క్షేత్రాలకు నీటిని తీసుకెళ్లే వెదురు పైపులు.
- **డాంగ్స్:** అసోంలోని బోడో తెగలు ఉపయోగించే నీటి కుంటలు
- **గర్-దార:** చుట్టుపక్కల ఉండే నీటి ప్రవాహాల నుంచి నీటిని సేకరించి నిల్వ ఉంచే అతిపెద్ద బావులు
- **డంగ్స్/జంపోయిస్:** పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయిగురిలో వరి పొలాల కోసం ఏర్పాటు చేసిన నీటి కాలువలు
- **ఇనుండేషన్ ఛానెల్స్:** పశ్చిమ బెంగాల్‌లో వరద ప్రవాహాన్ని వ్యవసాయ క్షేత్రాలకు మళ్లించే కాలువలు.
- **పాట్:** మధ్యప్రదేశ్‌లోని బాబువ ప్రాంతంలో నీటి ప్రవాహాలను మళ్లించడానికి నిర్మించిన కట్టలు.
- **కటాస్/బందాస్:** ఒడిశాలో నిర్మించిన మట్టి ఆనకట్టలు
- **హవేలి:** మధ్యప్రదేశ్‌లోని వ్యవసాయ క్షేత్రాలలో నిర్మించిన మట్టి ఆనకట్టలు
- **కుయిస్/బెరీస్:** రాజస్థాన్‌లో వర్షపు నీటిని సేకరించేందుకు ఏర్పాటు చేసిన లోతైన గుంతలు
- **బావోలీస్/బెర్స్:** రాజస్థాన్‌లో ప్రధానంగా తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బావులు
- **పార్:** రాజస్థాన్‌లో లోతైన గుంతలలో(బెరీస్) నిల్వ చేసిన నీటిని వాడుకునే ప్రాంతం
- **కుండ్స్/కుండీస్:** రాజస్థాన్‌లోని పాళీ ప్రాంతంలో సాసర్ ఆకారపు పరివాహపు ప్రాంతాన్ని కలిగిన వలయాకారపు భూగర్భ బావులు
- **తలాబ్/నాడి:** రాజస్థాన్‌లోని జోద్‌పూర్ ప్రాంతంలోని గ్రామాలలో నిర్మించిన నీటి కుంటలు.
- **టంకాలు:** బికనీర్ ప్రాంతంలో గృహాలలో తాగునీటి కోసం సున్నపురాయితో నిర్మించే బావులు
- **బావోళి/బావడి:** రాజస్థాన్‌లో దిగుడు మెట్ల బావిని పోలిన నిర్మాణాలు. వీటినే 'వావ్' లేదా 'వారది' అని గుజరాత్‌లో పిలుస్తారు.
- **జోహాడ్స్:** రాజస్థాన్‌లో వాలుకు అనుగుణంగా మూడు వైపులా కట్టలు నిర్మించి ఒక వైపున నీరు ప్రవహించడానికి అనువుగా నిర్మించిన నిర్మాణాలు. వర్షపు నీరు భూమిలోనికి ఇంకడానికి ఈ నిర్మాణాలు ఉపయోగపడతాయి.
- **పాడ్, భాండారాలు:** మహారాష్ట్రలోని తపతి నది పరివాహక ప్రాంతంలో ఉన్నాయి. బందారా అంటే చిన్న వాగుల మీద అడ్డంగా కట్టిన కట్టలు. వాటి నుంచి కాలువలు తవ్వి, నీటిని వ్యవసాయ భూములకు తరలిస్తారు. ఈ వ్యవసాయ భూములను పాహడ్స్ అంటారు.

నోట్: తమిళనాడు రాష్ట్రం మొట్ట మొదటి సారిగా వర్షపు నీటిని నిల్వ చేయటాన్ని చట్టంగా చేసింది.

దేశంలో ఉమ్మడి ప్రాజెక్టులు

- **గండక్ ప్రాజెక్ట్:** బిహార్+ఉత్తరప్రదేశ్
- **దామోదర్ వ్యాలీ ప్రాజెక్ట్:** జార్ఖండ్+వెస్ట్ బెంగాల్
- **రామ్ గంగా:** ఉత్తరాఖండ్+ఉత్తరప్రదేశ్
- **చంబల్ ప్రాజెక్ట్:** మధ్యప్రదేశ్+రాజస్థాన్
- **ఇందిరాసాగర్ ప్రాజెక్ట్:** మధ్యప్రదేశ్+గుజరాత్
- **సర్దార్ సరోవర్ ప్రాజెక్ట్:** గుజరాత్+రాజస్థాన్+మధ్యప్రదేశ్+మహారాష్ట్ర

అంతర్జాతీయ ఉమ్మడి ప్రాజెక్టులు

- **గండక్ ప్రాజెక్ట్:** ఇండియా+నేపాల్
- **మహాంకాళి ప్రాజెక్ట్:** ఇండియా+నేపాల్
- **కోసి ప్రాజెక్ట్:** ఇండియా+నేపాల్
- **సంకోష్ ప్రాజెక్ట్:** ఇండియా+భూటాన్
- **తనక్ పూర్ ప్రాజెక్ట్:** ఇండియా+నేపాల్



వి.వెంకటరెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ

ఏపీ ఐసెట్ నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(ఏపీఎస్‌సీహెచ్‌ఈ)-ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ ఐసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ పరీక్షని అనంతపురంలోని శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ నిర్వహిస్తోంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.650; బీసీ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.550
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 7
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 28 నుంచి 29 వరకు
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 2 నుంచి
- **ఏపీ ఐసెట్ 2024 తేదీలు:** మే 6, 7
- **ఫలితాలు విడుదల:** జూన్ 20
- **వెబ్‌సైట్:** cets.apsche.ap. gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/eXWZjTlలో చదవండి.

నిట్ ఎంసీఏలో ప్రవేశానికి నిమ్‌సెట్

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) సంస్థలు అందిస్తున్న మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(ఎంసీఏ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన 'నిట్ ఎంసీఏ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (నిమ్‌సెట్) 2024' నోటిఫికేషన్ వెలువడింది. దీనిని నిట్ జంషెడ్‌పూర్ నిర్వహిస్తోంది. ఇందులో ఐఐఐటీ భోపాల్ సహా వరంగల్, రాయ్‌పూర్, సూరత్కల్, తిరుచిరాపల్లి, కురుక్షేత్ర, అగర్తల, జంషెడ్‌పూర్, భోపాల్, అలహాబాద్, పట్నా నిట్‌లు పార్టిసిపేట్ చేస్తున్నాయి. నిమ్‌సెట్ 2024లో సాధించిన ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు.

సీట్ల వివరాలు: మొత్తం 1033 సీట్లు ఉన్నాయి. వరంగల్ నిట్‌లో 58, తిరుచిరాపల్లి నిట్‌లో 115, సూరత్కల్ నిట్‌లో 58, రాయ్‌పూర్ నిట్‌లో 110, కురుక్షేత్ర నిట్‌లో 96(వీటిలో సెల్ఫ్ ఫైనాన్సింగ్ స్కీమ్ సీట్లు 32), జంషెడ్‌పూర్ నిట్‌లో 115, భోపాల్ ఎంఏఎన్‌ఐటీలో 115, అలహాబాద్ ఎంఎఎన్ ఐటీలో 116, అగర్తల నిట్‌లో 30 సీట్లు ఉన్నాయి. పట్నా నిట్‌లో డేటా సైన్స్&ఇన్ఫర్మాటిక్స్ 80, ఏఐ&ఐఓటీ 80 సీట్లు ఉన్నాయి. సెల్ఫ్ ఫైనాన్సింగ్ స్కీమ్ కింద ప్రతి స్పెషలైజేషన్‌లో సగం సీట్లు కేటాయించారు. భోపాల్ ఐఐఐటీలో 60 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ప్రథమ శ్రేణి మార్కులతో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారు; బీఈ/ బీటెక్ ఉత్తీర్ణులు; ఓపెన్ యూనివర్సిటీల నుంచి దూరవిద్య విధానంలో డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

నిమ్‌సెట్ వివరాలు: ఈ పరీక్షని సీబీటీ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మొదటి పార్ట్‌లో మేథమెటిక్స్ నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. దీనికి 70 నిమిషాల పరీక్ష సమయం ఉంటుంది. రెండో పార్ట్‌లో అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 40 ప్రశ్నలు ఇస్తారు. దీనికి 30 నిమిషాల సమయం ఇస్తారు. మూడో పార్ట్‌లో కంప్యూటర్ అవేర్‌నెస్ నుంచి 20, జనరల్ ఇంగ్లీష్ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. దీనికి 20 నిమిషాల సమయం ఇస్తారు. మేథమెటిక్స్ ప్రశ్నలకు ఒక్కోదానికి 12 మార్కులు; అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్, కంప్యూటర్ అవేర్‌నెస్ ప్రశ్నలకు ఒక్కోదానికి 6 మార్కులు; జనరల్ ఇంగ్లీష్ ప్రశ్నలకు ఒక్కోదానికి 4 మార్కులు కేటాయించారు. సమాధానం తప్పుగా గుర్తిస్తే పావు వంతు మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 1000. ప్రశ్నలన్నీ అంగ్ల మాధ్యమంలో మాత్రమే ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 20
- **వెబ్‌సైట్:** www.nimcet.in, www.nimcet.admissions.nic.in

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

తెలుగు జనచైతన్య యాత్రతో ప్రజల్లోకి

● నేటి నుంచి నియోజకవర్గ పాదయాత్ర ● నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, మార్చి 6: తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా రానున్న ఎన్నికల్లో ఈ దుర్మార్గపు ప్రభుత్వాన్ని సాగనంపేలా తెలుగు జనచైతన్య పాదయాత్రను చేపట్టామని జనసేన పీఏసీ చైర్మన్, తెనాలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం తెనాలి జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గురువారం సాయంత్రం 4గంటల నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు మనోహర్ తెలిపారు. తెనాలిలోని స్వరాజ్ థియేటర్ నుంచి తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు, వీర మహిళలు ఇరు పార్టీల అభిమానులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. గుంటూరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, జిల్లా ఇరుపార్టీల నాయకులు ఈ పాదయాత్రలో పాల్గొంటారన్నారు. తెనాలి నియోజవర్గంలో ఎన్నో సమస్యలున్నాయని ఎన్నికల అనంతరం మన ప్రభుత్వం ఏర్పడగానే వాటన్నింటిని పరిష్కరించి ప్రజలకు ఈ ప్రాంత అభివృద్ధికి నిష్పక్షపాతంగా పాటుబడతానని మనోహర్ స్పష్టం చేశారు. ఈ పాదయాత్రకు ప్రజలందరూ సంఘీభావంగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

వికలాంగుల సింహగర్జనను విజయవంతం చేయాలి

చేబ్రోలు, మార్చి 6: వికలాంగుల సింహగర్జనను విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షురాలు కె నవమణి కోరారు. బుధవారం చేబ్రోలులో వీహెచ్‌పీఎస్ సమావేశం జరిగింది. కార్యక్రమానికి హాజరైన నాయకులు మాట్లాడుతూ వికలాంగుల హక్కుల సాధన కోసం ఈ నెల 9వ తేదీన నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురు వికలాంగుల మహాగర్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగే ఈ సింహగర్జనకు జిల్లాలోని వికలాంగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.



రోశయ్య కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్, రాజకుమారి తదితరులు

ఉమ్మడి రాష్ట్ర ఆర్థిక ప్రణాళికలో రోశయ్య పాత్ర కీలకం

● ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్, మార్చి 6: ఉమ్మడి రాష్ట్ర ఆర్థిక ప్రణాళికలో దివంగత మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య కీలక పాత్ర పోషించారని, రాష్ట్రానికి ఆయన ఎనలేని సేవలు అందించారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. విజయవాడ రోడ్డులో తెనాలి బండ్‌పై ఏర్పాటుచేసిన రోశయ్య కాంస్య విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్మన్ నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, మున్సిపల్ మాజీ చైర్ చైర్మన్లు పెండేల వెంకట్రావు, ఆలమూరి విజయలక్ష్మి, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, నూకల వేణు, నంబూరు కృష్ణమూర్తి, సాధుప్రతాప్, దాసరి మురళీకాంత్, బొలిశెట్టి ప్రభాకరరావు, చందు రామారావు, కాటూరి వెంకటేశ్వరరావు, అచ్యుత సాంబశివరావు, రోశయ్య కుమారుడు శివసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి బండ్‌పై గుమ్మడి విగ్రహావిష్కరణ



గుమ్మడి విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్, తదితరులు

విజయవాడ రోడ్డులో వీఎస్ఆర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన తెనాలి బండ్‌పై దివంగత సినీనటుడు గుమ్మడి వెంకటేశ్వరరావు విగ్రహాన్ని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆవిష్కరించారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తెనాలి సమీపంలోని రావికంపాడులో జన్మించిన గుమ్మడి సినీరంగంలో ఎంతో ఎత్తుకు ఎదిగారని చెప్పారు. ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం సముచితమన్నారు. కార్యక్రమంలో గుమ్మడి హరిప్రసాద్, గొట్టిముక్కల విజయశ్రీ, గోగులమూడి శారద, డాక్టర్ పాటిబండ్ల దక్షిణమూర్తి, నాయుడు గోపి, గుమ్మడి నాగేశ్వరరావు, వీరేంద్రబాబు, గంగాధరరావు, హరిత పాల్గొన్నారు.

18న గుంటూరులో ఏపీ బీసీ సంక్షేమ సంఘం ప్లీనరీ

గుంటూరు, మార్చి 6: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర స్థాయి ప్లీనరీ ఈ నెల 18న గుంటూరులో నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. గుంటూరులో బుధవారం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా బీసీల మనోగతంపై చర్చించనున్నట్లు తెలిపారు.

పురపాలక సంఘ కార్యాలయంలో మహిళా దినోత్సవం

తెనాలి, మారీసుపేట మార్చి 6: పట్టణంలోని పుపాలక సంఘ కార్యాలయంలో బుధవారం ఆంధ్రా పారిస్ మున్సిపల్ వెల్ఫేర్ అసోసియేషన్, తెనాలి వారు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పాల్గొని, అధికారులతో కలసి మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం మున్సిపల్ ఉద్యోగులు చైర్‌పర్సన్ రాధికను, వైస్‌చైర్‌పర్సన్ అత్తోట నాగవేణిని, అసిస్టెంటు కమిషనర్ కె.అనూషను, హెల్త్‌ఆఫీసర్ హెలెన్ నిర్మల, ఇంజనీర్ పి.లక్ష్మీప్రసన్న, వై అనుపమలను సత్కరించి మెమెంటోలను అందజేశారు.

రాష్ట్రంలో అరాచకపాలనకు చరమగీతం పాడుదాం

● టీడీపీ, జనసేన ఆత్మీయ సమావేశంలో ఆలపాటి, నాదెండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఆలపాటి, పక్కన నాదెండ్ల

తెనాలి రూరల్, మార్చి 6: అవినీతి, అక్రమాలు, భూదందాలు, మట్టి మాఫియాలు, ఇసుక అక్రమ రవాణా ఇలా వైసీపీ అధికారం చేపట్టిన నాటినుంచి రాష్ట్రంలో అరాచకపాలన సాగుతుందని ఇకనైనా ఆ పాలనకు చరమగీతం పాడుదామని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌లు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్వీఆర్ ఫంక్షన్ హాల్లో టీడీపీ, జనసేన పార్టీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే రోజుల్లో ఉమ్మడి పార్టీ ప్రణాళికపై చర్చించారు. గురువారం సాయత్రం నుంచి ప్రారంభం కానున్న తెలుగుచైతన్య పాదయాత్రపై ఇరుపార్టీ శ్రేణులకు వివరించారు. ఇరు పార్టీల శ్రేణులు ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు ప్రజలకు నిజమైన సంక్షేమం అందించడం జరుగుతుందని రాష్ట్రభవిష్యత్తుకు ఉమ్మడి నాయకత్వాన్ని బలపరుచుకోవాలన్నారు. రేపటిపాదయాత్రకు ఇరుపార్టీల శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించిన తొలి రాజకీయ పార్టీ తెలుగుదేశం పార్టీ మాత్రమేనని అన్నారు. రానున్న ఎన్నికలలో టీడీపీ-జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులను అత్యంత భారీ మెజారిటీతో గెలిపించుకుందామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరావు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం: ఆలపాటి

తెనాలి, మారీసుపేట మార్చి 06: రాష్ట్రంలో బీసీ అభ్యున్నతి, సంక్షేమం తెలుగుదేశం పార్టీ అధినేత మాజీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యం అని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. పట్టణలో పార్టీ కార్యాలయంలో బుధవారం జయహో జీసీ సభను విజయవంతం చేసిన బీసీ సోదర, సోదరీమణులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సంద

మినీ మేనిఫెస్టోపై ప్రచారం

తెనాలి రూరల్, మార్చి 6: పట్టణంలోని 27వ వార్డులో శంఖారావం కార్యక్రమంలో ఆలపాటి వార్డు ప్రజలను బుధవారం కలుసుకున్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం ఏ విధంగా నష్టపోయింది, ప్రజలు అధిక ధరలతో, నిరుద్యోగులు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక పోరుగురాష్ట్రాలకు తరలిపోయే పరిస్థితి, అన్నదాతలు సాగునీరు సకాలంలో అందించక క్రాప్ హాలిడేస్ ప్రకటించిన సందర్భాలను ప్రజలకు వివరించారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ టీడీపీ, జనసేన ఉమ్మడి మినీ మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బోయపాటి అరుణ పలువురు టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ చారిత్రాత్మకం: టీడీపీ, జనసేన

పొన్నూరు టౌన్, మార్చి 6: బీసీ డిక్లరేషన్ ప్రకటించటం చారిత్రాత్మకం అని టీడీపీ గుంటూరు పార్లమెంట్ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు అన్నారు. జయహో బీసీ సభ ద్వారా బీసీ డిక్లరేషన్ ప్రకటించిన టీడీపీ, జనసేన పార్టీ అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలుపుతూ పట్టణంలోని ఐల్యాండ్ సెంటర్‌లో సంబరాలు నిర్వహించారు. ఐల్యాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతోనే బీసీలకు ఆంధ్రప్రదేశ్‌లో గుర్తింపు లభించిందన్నారు. జయహో బీసీ సభ ద్వారా తిరిగి రాష్ట్రంలో బీసీలకు మేలుచేసేలా డిక్లరేషన్ తీసుకురావటం హర్షణీయం అన్నారు. బీసీ డిక్లరేషన్ ప్రకటించిన టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన కూటమికి మద్దతు పలకాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జనసేన పట్టణ, మండల అధ్యక్షుడు షేక్ కరిముల్లా, నాగిశెట్టి సుబ్బారావు, టీడీపీ పట్టణ, మండల అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌ఖాన్, బండ్లమూడి బాబురావు, ఇరుపార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెదకాకానిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ, జనసేన నాయకుల ఆనందోత్సాహాలు

● పెదకాకాని, మార్చి 6: బీసీల సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయం లక్ష్యంగా తెలుగుదేశం - జనసేన పార్టీలు ఉమ్మడిగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ పెదకాకాని సెంటర్‌లోని బీఆర్ అంబేద్కర్, నందమూరి తారక రామారావు, సర్దార్ గౌత్ లచ్చన్న, వంగవీటి మోహన రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి టీడీపీ, జనసేన నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ గారికి కృతజ్ఞతలు తెలిపారు.

కాకాని మల్లన్న బ్రహ్మోత్సవాలు ఆరంభం



శివపార్వతుల కల్యాణ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణం చేస్తున్న ఈవో, చైర్మన్లు

పెదకాకాని, మార్చి 6: పెదకాకాని మల్లన్న సన్నిధిలో మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా బుధవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద్, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకర్ రావులు ఆరంభించారు. ఆలయ అర్చకులు సాంప్రదాయబద్ధంగా మహాశివరాత్రి కళ్యాణ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణచుట్టారు. సంప్రదాయబద్ధంగా భ్రమరాంబ అమ్మవారిని, మల్లేశ్వరస్వామి వారిని పెళ్ళికొడుకు పెళ్ళి కుమార్తెగా ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఆలయాన్ని ప్రత్యేకంగా శుద్ధిచేసి, విద్యుత్ బల్బులతో ప్రత్యేకంగా అలంకరించారు. శివపార్వతుల కల్యాణానికి ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. అలంకరణలో భాగంగా బుధవారం అమ్మవారు భ్రమరాంబదేవిగా దర్శనం ఇచ్చారు.

ఎద్దుల బండి విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి కాకాని

తెనాలి రూరల్, మార్చి 6: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎద్దుల బండి, రైతులు విగ్రహాన్ని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి పెద్దఎత్తున పాటుబడింది వైసీపీ ప్రభుత్వమన్నారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పలువురు వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

పొన్నూరు టౌన్, మార్చి 6: మండల పరిధిలోని మునిపల్లెలో 17 ఏళ్ల బాలిక అదృశ్యంపై బుధవారం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రూరల్ ఎస్‌ఐ బండ్ల భార్గవ్ కథనం ప్రకారం మునిపల్లె గ్రామానికి చెందిన బాలిక గుంటూరులో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. ఈ నెల 5వ తేదీన కళాశాల నుంచి ఇంటికి ఆలస్యంగా వచ్చిన బాలికను తల్లి మందలించింది. దీంతో రాత్రి 8గంటల సమయంలో బాలిక ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైంది. దీంతో తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భార్గవ్ తెలిపారు.

నిడుబ్రోలు ఎరువుల దుకాణాలో విజులెన్స్ తనిఖీలు

పొన్నూరు టౌన్, మార్చి 6: పట్టణంలోని నిడుబ్రోలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలో విజలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. విజులెన్స్ ఎస్పీ కె ఈశ్వరరావు ఆదేశాలతో నిడుబ్రోలులో రెండు షాపులో తనిఖీలు నిర్వహించగా 0 ఫార్మ్‌వో రికార్డులు నమోదు చేయకుండా నిల్వ ఉంచిన్న రూ.89వేలు విలువ చేసే ఎరువులు, బయో ఉత్పత్తులను గుర్తించి అమ్మకాలు నిలిపివేశారు. తనిఖీలలో విజులెన్స్ ఏవో కె రమణ కుమార్, ఎస్‌ఐ ఎం.రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బాజీ బాబా హుండీ ఆదాయం రూ.13.2 8 లక్షలు

పెదకాకాని, మార్చి 6: పెదకాకాని హజరత్ సయ్యద్ ఆవుల బాజీ బాబా దర్గాలో బుధవారం చేపట్టిన హుండీల లెక్కింపు పూర్తయింది. ఐదు నెలలకు గాను హుండీల ద్వారా బాజీ బాబాకు రూ.13.28 లక్షల ఆదాయం లభించినట్లు దర్గా ఈవో ముక్తార్ భాష తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జేఎంజే కళాశాలలో చెవి, ముక్కు సమస్యలపై అవగాహన

తెనాలి అర్బన్, మార్చి 6: జేఎంజే మహిళా కళాశాలలో బుధవారం చెవి, ముక్కు సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈఎన్‌టీ వైద్యులు చందవోలు భానుప్రసాద్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెవి సమస్యలు రావడానికి గల కారణాలు - తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కరస్పాండెంట్ థెరీసమ్మ, ప్రిన్సిపాల్ షైనీ, అధ్యాపకులు సరోజిని, తనూజ, యోజిత పాల్గొన్నారు.

10న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమావేశం

తెనాలి అర్బన్, మార్చి 6: సుల్తానాబాద్ రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో ఆదివారం 10వ తేదీన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమావేశం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి అసెంబ్లీ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌లు పాల్గొంటారని పెన్షనర్లందరూ హాజరు కావాలని కోరారు.

నేడు పాత శివాలయంలో కొబ్బరి చిప్పల సేకరణ హక్కుల వేలం

తెనాలి అర్బన్, మార్చి 6: గంగానమ్మపేట పాతశివాలయంలో కొబ్బరి చిప్పల సేకరణ హక్కులవేలం గురువారం జరుగుతుందని ఈవో రమణకుమారి తెలిపారు. రెండేళ్ల కాలానికిగాను నిర్వహించే వేలంలో ఆసక్తిగలవారు పాల్గొనాలని, వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

హుండీల లెక్కింపు ద్వారా రూ. 87 వేల ఆదాయం

పొన్నూరు టౌన్, మార్చి 6: మండల పరిధిలోని కట్టెంపూడి నాగేంద్ర స్వామి (పుట్ట) దేవస్థానం హుండీల లెక్కింపు ద్వారా రూ.87,553 ఆదాయం సమకూరినట్లు ఆలయ మేనేజర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో ఆలయానికి చెందిన రెండు హుండీలను లెక్కించారు.

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలి: సీఐ

కొల్లిపర, మార్చి 6: ఓటు హక్కును మండల ప్రజలు నిర్భయంగా వినియోగించు కోవాలని సీఐ టి.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర గ్రామాల్లో సీఐ టి.వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకూడదన్నారు.

పెదకాకాని పంచాయతీలో ఉద్యోగుల చేతివాటం


పెదకాకాని, మార్చి 6: పెదకాకాని గ్రామపంచాయతీలో ఉద్యోగులు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు.... కంచే చేను మేసిన సామెతగా అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులే పంచాయతీ నిధులను కొల్లగొడుతున్నారు. ఇంటి పన్ను, కుళాయి పన్ను వసూలు చేసిన సిబ్బంది ఆ నిధులను సుమారు నాలుగు లక్షల మేరకు స్వాహా చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. గ్రామ పంచాయతీ చెందిన బిల్ కలెక్టర్, సచివాలయ కార్యదర్శి మరో ఇద్దరు ఉద్యోగులు ఈ డబ్బులను వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నట్లు తెలిసింది.

వీరబ్రహ్మేంద్రస్వామి కోటి లేఖన ప్రతుల ఆవిష్కరణ

తెనాలి, మారీసుపేట మార్చి 6: గాంధీచౌక్‌లోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవస్థాన ఆవరణలో బుధవారం వీరబ్రహ్మేంద్ర స్వామి ద్వాదశాక్షరీ మహా మంత్రం కోటి లేఖన మహా యజ్ఞ పత్రికలను పంపిణీ చేశారు. శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఈఎల్‌వీ అప్పారావు వీటిని ముద్రించారు.

ఉర్దూ పాఠశాలల్లో డీవైఈవో తనిఖీలు

కొల్లిపర, మార్చి 6: ఉర్దూ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని జిల్లా ఉపతనిఖీ అధికారి ఎండీ ఖాసిం అన్నారు. బుధవారం మండల పరిధిలోని మున్నంగి, కొల్లిపర, పిడపర్రు, ఉర్దూ పాఠశాలను ఎంఈవోలు సాల్మన్‌రాజు, ఝాన్సీలతతో కలిసి ఆయన వార్షిక తనిఖీ చేశారు. ఉర్దూ పాఠశాలలోని రికార్డులను, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కే కరీమూన్, ఖాలీషావలి, జరీనా, వహీదాబేగం, సీఆర్పీలు పిడపర్తి రమేష్‌బాబు, మురళి, అలేఖ్య, రాంబాబు, స్వరూపరాణి, ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.







యువత బంగారు భవిష్యత్తు కోసమే టీడీపీ, జనసేన పొత్తు

● ధూళిపాళ్ళ నాగసాయి వైదీప్తి



జెండా చెట్టు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ధూళిపాళ్ల వైదీప్తి తదితరులు

పొన్నూరు టౌన్, మార్చి 6: రాష్ట్ర యువత బంగారు భవిష్యత్తు కోసం టీడీపీ, జనసేన విజయం సాధించటం అవసరం అని ధూళిపాళ్ళ నాగసాయి వైదీప్తి అన్నారు. పొన్నూరు పట్టణంలోని 4, 5 వార్డులో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కుమార్తె నాగసాయి వైదీప్తి ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ప్రకటించిన మినీ మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి వెళ్లి పంచిపెట్టి టీడీపీ, జనసేనకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేసారు. మార్కెట్ సెంటర్ వద్ద జెండా చెట్టు వద్ద స్థానికమహిళలు, యువతతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కూరగాయల వర్తకులను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసే పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలులో టీడీపీ అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మహిళలపై కానిస్టేబుల్ దాడి... కేసు నమోదు

పెదకాకాని, మార్చి 6: నలుగురు మహిళలను ఓ కానిస్టేబుల్ విచక్షణ రహితంగా కొట్టడంపై పెదకాకాని పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు అందింది. గుంటూరు, విజయవాడ ప్రాంతాలకు చెందిన పలువురు మహిళలు కొప్పురావూరు సమీపంలో వ్యభిచార వృత్తిని నిర్వహిస్తున్నారు. కానిస్టేబుల్ బుధవారం మధ్యాహ్నం వారి వద్దకు వచ్చి నలుగురు మహిళలను విచక్షణరహితంగా కొట్టాడు. దీంతో బాధిత మహిళలు నేరుగా పెదకాకాని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ కే వీరస్వామికి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి వారి అనుమతితో కేసు నమోదు చేశారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్‌లు



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

తెనాలి, మారీసుపేట మార్చి 6: పేద ప్రజల కోసం పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ల సేవలు కొనసాగుతున్నాయని టీడీపీ నాయకులు అన్నారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సౌజన్యంతో స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో, శివాజిచౌక్‌లో అన్న క్యాంటీన్‌లలో బుధవారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాదల కోటేశ్వరరావు, వెనిగళ్ళ శివప్రసాద్, సోమవరపు సాంబశివరావు, కొత్తపల్లి రమేష్, జి. రమేష్, ముళ్ళపూడి వెంకట్, వెల్లంకి సాంబయ్య, ఎ.వెంకటేశ్వరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.